నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12-2-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 143 పేజీలు:6 వెల: రూ.1/-

ఈ రేసింగ్‌తో..ప్రజలకు కష్టాలు నిజమే: క్షమించండి మంత్రి కేటీఆర్

హైదరాబాద్ ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నగరంలో ఫార్ములా ఈ రేసింగ్ జరుగుతోంది. దీంతో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ప్రజలకు కష్టాలు నిజమేనని, పెద్ద మనసుతో క్షమించాలని కోరారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే క్రమంలో ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలతో హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని, ప్రజలు పెద్ద మనసుతో తనను క్షమించాలని మంత్రి కేటీఆర్ మరోసారి కోరారు.కాగా ఫార్ములా-ఈ మెయిన్ రేస్‌లో 11 ఆటోమొబైల్ కంపెనీలు, 22 మంది రేసర్లు పాల్గొన్నారు. ఎన్టీఆర్ మార్గ్, సచివాలయం, మింట్ కాంపౌండ్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, తెలుగుతల్లి పరిసర ప్రాంతాలు మూసివేశారు. రేసింగ్ చూసేందుకు 21వేల మందికి సీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ రేసింగ్‌ను తిలకించేందుకు సినీ, క్రికెట్ తారలు, మంత్రులు కేటీఆర్, పువ్వాడ, హీరో రామ్‌చరణ్, క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, శికర్ ధావన్, దీపక్ హూడ, చాహల్.. అలాగే ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు తదితరులు వచ్చారు.

22 వేలకు పైగా చేరిన టర్కి భూకంప మృతుల సంఖ్య

- గత 84 ఏళ్ల కాలంలో చోటుచేసుకున్న అతిపెద్ద భూకంపం ఇదే

టర్కి ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్); తుర్కియే.. సిరియా ప్రాంతాల్లో వరుస భూకంపాలు రావడంతో భారీ భవనాలు నేలమట్టమయ్యాయి. రోడ్లు ధ్వంసం కాగా.. సమాచార వ్యవస్థ స్తంభించిపోయింది. తుర్కియేలో గత 84 ఏళ్ల కాలంలో చోటుచేసుకున్న అతిపెద్ద భూకంపం ఇదే కావడం గమనార్హం.సోమవారం తెల్లవారుజామున అందరూ నిద్రలో ఉండగానే భారీ భూకంపం రావడంతో అంతా శిథిలాల కింద ఇరుక్కుపోయారు. ఈ ఘటన తర్వాత వరుస భూకంపాలు రావడంతో ప్రాణనష్టం తీవ్ర స్థాయిలో జరిగింది. తుర్కియే.. సిరియాలో భూకంపం వచ్చిన ప్రాంతాలు శ్మశానాలను తలపిస్తున్నారు.శిథిలాల కింద ఇరుక్కుపోయిన వారి ఆర్తనాదాలతో ఆ ప్రాంతాలు హృదయవిదారకంగా మారాయి. రోజుల గడుస్తున్న కొద్దీ భూకంప మృతుల సంఖ్య భారీగా పెరిగిపోతుండటం శోచనీయంగా మారింది. తాజా సమాచారం మేరకు తుర్కియే.. సిరియాల్లో భూకంప మృతుల సంఖ్య 22 వేలకు పైగా చేరింది. వేలాది మంది క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికితీసేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయం చేస్తున్నా ఇంకా చాలా మంది వాటి కిందే ఉన్నారు. 101 గంటలకు శిథిలాల కింద చిక్కుక్కున్న బాధితులకు తినడానికి ఆహారం.. తాగడానికి నీరు లేక ప్రాణాలు కాపాడుకునేందుకు అల్లాడుతున్నారు. అద్నాన్ మహమ్మద్ అనే వ్యక్తి 17 ఏళ్ల యువకుడు దాహార్తి తాళలేక తన మూత్రం తాగి ప్రాణాలతో బయటపడ్డాడు.తీవ్రమైన చలిగాలుల వణికిస్తున్నా ఎటు కదలేని స్థితిలో చాలామంది మృత్యువుతో పోరాడుతున్నారు. వీరిలో కొందరు మృత్యుంజయులుగా బయటపడుతున్నారు. నాలుగు రోజుల శిథిలాల కింద చిక్కుకున్న అద్నాన్ మహమ్మద్ ను రెస్క్యూ టీం కాపాడింది. అతడు ప్రాణాలతో బయటపడిన తర్వాత తల్లిదండ్రులను హత్తుకొని బోరున విలపించాడు.అలాగే అదియామన్ అనే చోట నాలుగేళ్ల చిన్నారి 105 గంటలపాటు శిథిలాల కింద ఇరుక్కుపోయిన ప్రాణాలతో బయట పడింది. ఈ చిన్నారిని తల్లి వద్దకు చేర్చేందుకు అధికారులు ప్రయత్నిస్తుందన్నారు.

ఇస్కెందరన్ ప్రాంతంలో శిథిలాల కింద ఇరుక్కుపోయిన తొమ్మిది మందిలో ఆరుగురిని ప్రాణాలతో కాపాడారు. కిరిఖాన్లో 50 గంటల తర్వాత ఓ మహిళను జర్మనీ బృందం కాపాడింది.మరోచోట ఇద్దరు అక్కాచెల్లెళ్లను రిస్క్యూ సిబ్బంది కాపాడారు. శిథిలాల కింద ఇరుక్కున్న 20ఏళ్ల విద్యార్థిని వాట్సాప్ కాపాడింది. తుర్కియేలో ఓ అపార్ట్ మెంట్లో ఇరుక్కున్న విద్యార్థి సమయస్ఫూర్తితో తాను ఉన్న ప్రాంతాన్ని స్నేహితులకు వాట్సాప్ లో షేర్ చేశాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని శిథిలాల కింద ఇరుక్కున్న విద్యార్థిని కాపాడారు.ఇదిలా ఉంటే తల్లి బొడ్డు ఊడకుండా పుట్టిన ఓ చిన్నారిని సహాయ బృందం కాపాడారు. ఈ చిన్నారి కుటుంబం మొత్తం చనిపోగా ఆస్పత్రిలో ఆ పాపకు ఓ వైద్య బృందం చికిత్స అందిస్తున్నారు. ఆ పాపకు మాయ అని పేరు పెట్టారు. మాయ అంటే అద్భుతం అని అర్థం. ఈ పాపకు వైద్యుడి భార్య మానవత్వంలో పాలు పట్టిస్తోంది.అయితే సమయం గడిచే కొద్దీ శిథిలాల కింద ఇరుక్కుపోయిన వారిని ప్రాణాలతో కాపాడటం కష్టంగా మారనుంది. గరిష్టంగా వారం వరకు మాత్రమే ప్రాణాలతో కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే శిథిలాల కింద ఇరుక్కుపోయిన వారిని కాపాడేందుకు సహాయ బృందాలు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నాయి. తుర్కియే భూకంప బాధితులకు భారత్ అన్ని విధాలా సాయం అందిస్తోంది.

కాంగ్రెస్ హయాంలో పాలమూరు బిడ్డలు ఎందుకు వలస పోయారు : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం వల్లే పాలమూరు వాసులు వలసలు పోయారని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టులు తమ హయాంలోనే నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను తప్పుబట్టారు. ప్రాజెక్టులు నిర్మిస్తే పాలమూరు వాసులు ఎందుకు వలసలు వెళ్లారని కాంగ్రెస్ సభ్యుడు భట్టి విక్రమార్కను ప్రశ్నించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నెట్టంపాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టుల కింద కేవలం 27వేల 300 ఎకరాలు మాత్రమే పారిందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ హయాంలో పంపు హౌజ్‌లు పూర్తి కాలేదు. కాలువలు నిర్మించలేదు. పంపులు, మోటార్లు గడ్డ మీద పెట్టిండ్రు.

పంపు హౌజ్‌లు తవ్వకుండానే బిల్లులు తీసుకున్నార' ని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం , ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రూ.3,663 కోట్లను ఖర్చుపెట్టి అసంపూర్తిగా ఉన్న మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి 5లక్షల 69 వేల ఎకరాలకు నీరందించామని తెలిపారు.

టీడీపీ హయాంలో ప్రాజెక్టుల వద్ద చంద్రబాబు కొబ్బరి కాయలు కొట్టగా కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టుల వద్ద రాజశేఖర్‌రెడ్డి మొక్కలు నాటి డ్రామాలు ఆడారని ఎద్దేవా చేశారు. ఈ మూడు ప్రాజెక్టుల కింద 5లక్షల 69 వేలు, జూరాల కింద లక్ష ఎకరాలకు మొత్తం 7లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.వీటితో పాటు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మతులు , పెద్ద సంఖ్యలో చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల పాలమూరు పచ్చబడి, వలసలు వాపసు వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. జలయజ్ఞం ద్వారా కాంగ్రెస్ నాయకులు ఏమి చేశారో ప్రజలకు తెలుసని అన్నారు. పాలమూరు వాసులకు ఎవరేమి చేశారో అన్ని విషయాలు తెలుసని అన్నారు.



వడ్డించేవాళ్లు మనవాళ్లయితే అన్నట్లు వ్యవహరిస్తున్న కేంద్రం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 11: వడ్డించే వాళ్లు మనవాళ్లయితే అన్నట్లు కేంద్రం వ్యవహరిస్తున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సహకరించడం లేదని చెప్పారు. ప్రతిపాదనలు పంపినా స్పందించడం లేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే మెట్రోలకే నిధులు ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోటీ 20 లక్షల మంది నివసిస్తున్న హైదరాబాద్‌కు నిధులు ఇవ్వడానికి కేంద్రానికి శత్రుదేశంపై పగబట్టినట్లుగా కేంద్రం తెలంగాణపై కక్షగట్టిందన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎస్ఎన్‌డీపీ, మెట్రో రైలు, చార్మినార్ పాదబాట అభివృద్ధి పనులకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. ఢిల్లీ మెట్రో అధికారులతో హైదరాబాద్ మెట్రో ఆడిటింగ్ చేయించామన్నారు.

అమీర్‌పేట మెట్రో స్టేషన్ ఎంత కిక్కిరిసిపోతుందో అందరికీ తెలుసన్నారు. 80 శాతానికిపైగా తెలంగాణ పిల్లలే పని చేస్తున్నారని వెల్లడించారు. మెట్రో ధరలు ఇష్టంవచ్చినట్లు పెంచితే ఊరుకోబోమని చెప్పారు. ఆర్టీసీతో సమానంగా ధరలు ఉండాలని మెట్రో అధికారులకు సూచించామని వెల్లడించారు. రూ.6250 కోట్లతో ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణకు శ్రీకారం చుట్టామన్నారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను మూడేండ్లలో పూర్తిచేస్తామన్నారు. హైదరాబాద్ అంటే చార్మినార్ అని అందరికీ తెలుసన్న మంత్రి.. పాతబస్తీకి మెట్రో పనులపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

హైదరాబాద్ ఆత్మ ఎప్పటికీ చెదిరిపోదు

హైదరాబాద్ సాంస్కృతిక వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని కేటీఆర్ అన్నారు. ఎన్ని అధునాతన భవంతులు వెలసినా హైదరాబాద్ ఆత్మ ఎప్పటికీ చెదిరిపోదన్నారు. గుల్జార్‌హౌస్, మీర్-ఆలం-మండి, ఆషూర్ ఖానాకు పూర్వవైభవం తీసుకొస్తున్నామని చెప్పారు. మదీనా నుంచి పత్తర్‌గట్టి వరకు పనులు పూర్తికావొచ్చాయన్నారు. పాతబస్తీలో సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టామని తెలిపారు. చార్మినార్ నుంచి దార్-ఉల్-ఉలం స్కూల్ వరకు రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. హుస్సేనీ ఆలం నుంచి దూద్‌బౌలి వరకు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. హెరిటేజ్ భవంతుల పూర్వవైభవం కోసం ఎంత ఖర్చయినా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఎస్ఎన్‌డీపీ ఏ నగరంలోనూ లేదు

హైదరాబాద్‌లో రూ.985.45 కోట్లతో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి చేపట్టామని మంత్రి కేటీఆర్ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 35 పనులకు 11 పూర్తిచేశామన్నారు. పరిసర మున్సిపాలిటీల్లో 21 పనులకుగాను 2 పూర్తిచేశామన్నారు. నగరంలో వందేండ్ల క్రితం నిర్మించిన నాలాలే ఉన్నాయని మంత్రి కేటీఆర్ అన్నారు. నాలాలపై 28 వేల మంది పేదలు ఇండ్లు కట్టుకున్నారని చెప్పారు. స్ట్రటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఎన్‌డీపీ) దేశంలో ఏ నగరం లోనూ లేదని వెల్లడించారు. ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2కు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. తొలిదశలో అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. కొన్ని పూర్తికావడంతో.. ఎల్బీనగర్‌లోని కొన్ని కాలనీల్లో గత వర్షాకాలంలో ముంపు సమస్య కొంతమేర తగ్గిందని స్పష్టం చేశారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మాగుంట కుమారుడు అరెస్టు

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. వరుస అరెస్టులతో హడలెత్తిస్తోంది. తాజాగా ఈ కేసులో ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు మాగుంట రాఘవను అరెస్టు చేసింది. ఈ మేరకు ఆయనను ఢిల్లీలో అరెస్టు చేసింది.ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో రాఘవను ప్రశ్నించాక అరెస్టు చేసినట్లు ఈడీ వెల్లడించింది. అలాగే ఫిబ్రవరి 11న రాఘవను ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనుంది. అదేవిధంగా ఈ కేసు విచారణకు సంబంధించి మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి మాగుంట రాఘవను కూడా కస్టడీకి తీసుకునేందుకు కోర్టు అనుమతి కోరనున్నట్లు ఈడీ వర్గాలు చెబుతున్నాయి.వారం రోజుల వ్యవధిలోనే ఈడీ అధికారులు ఇద్దరిని అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం మల్హోత్ర అనే వ్యక్తిని అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కాగా రాఘవ ప్రస్తుతం బాలాజీ గ్రూపు యజమానిగా ఉన్నారు. కాగా దేశవ్యాప్తంగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇప్పటికే సుమారు 9 మంది అరెస్టు అయ్యారు. ఈ స్కామ్తో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న సౌత్ గ్రూప్.. మాగుంట రాఘవరెడ్డి పేరును ప్రస్తావించినట్లు సమాచారం. కాగా ఇదే కేసులో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డిని గతేడాది అక్టోబర్లోనే సీబీఐ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయనతోపాటూ.. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను కూడా సీబీఐ ప్రశ్నించింది. ఇప్పుడు ఈడీ కూడా రంగంలోకి దిగి రాఘవను అదుపులోకి తీసుకుంది.మధ్యవర్తుల ద్వారా ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వానికి లంచాలు ఇచ్చారని మాగుంట రాఘవపై ఆరోపణలు. ఈ నేపథ్యంలో గత రెండ్రోజులుగా రాఘవరెడ్డిని ప్రశ్నిస్తున్న ఈడీ అధికారులు.. ఆయన సరిగా సహకరించట్లేదనే ఉద్దేశంతో అరెస్టు చేసినట్లు సమాచారం.కాగా సౌత్ గ్రూప్ కు సంబంధించి అభిషేక్ బోయినపల్లి శరత్ చంద్రారెడ్డి ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు రాఘవరెడ్డి ఇప్పటివరకూ అరెస్ట్ అయ్యారు. కాగా మాగుంట రాఘవ విషయానికొస్తే.. బాలాజీ డిస్టిలరీస్ కాకుండా ఏంజెల్ షాంపైన్ ఎల్ఎల్పీ తమిళనాడు డిస్టిలరీ ఇండస్ట్రియల్ ఆల్కహాల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ఇతర కంపెనీలు మాగుంట కుటుంబానికి సంబంధించిన రెండు కీలక సంస్థలపై సీబీఐ దృష్టి సారించిందని చెబుతున్నారు. ఢిల్లీ మద్యం తయారీ పంపిణీలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి.మరోవైపు ఈ కుంభకోణంలో రెండు రోజుల క్రితం న్యూఢిల్లీ కేంద్రంగా పని చేసే చారియట్ మీడియాకు చెందిన రాజేశ్ జోషి అనే వ్యక్తిని ఈడీ అరెస్టు చేసింది. అలాగే మూడు రోజుల క్రితం హైదరాబాద్కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ గోరంట్ల బుచ్చిబాబును సీబీఐ అదుపులోకి తీసుకుంది. ఈయన గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత పీఏగా పనిచేయడం గమనార్హం.కాగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన గౌతమ్ మల్హోత్రాను ఈడీ అధికారులు ఫిబ్రవరి 8 అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

తెలంగాణ సచివాలయ భవన ప్రారంభోత్సవం వాయిదా

హైదరాబాద్ ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేసీఆర్ బర్త్ డే నాడు తెలంగాణప్రజలకు నూతన సెక్రటేరియట్ ను కానుకగా ఇద్దామని బీఆర్ఎస్ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా రెడీ అయిన వేళ వారి ఆశలపై నీళ్లు చల్లారు. ఈ మేరకు ఈ భారీ ప్రోగ్రాం వాయిదా పడడం అందరినీ ఊసురుమనిపించింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఫిబ్రవరి 17న జరగాల్సిన తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవన ప్రారంభోత్సవం వాయిదా పడింది. భారత ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సంప్రదించిన అనంతరం ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలో తాజా తేదీని ప్రకటిస్తారు.మంత్రి కేటీఆర్ తెలంగాణ నూతన సచివాలయ ఆవిర్భావ వేడుకలకు పార్టీ నాయకులు క్యాడర్ను సిద్ధం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల ప్రజాప్రతినిధులతో రామారావు గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నేతలకు మంత్రి సూచించారు. సచివాలయం ప్రారంభోత్సవం తర్వాత నిర్వహించే పరేడ్ గ్రౌండ్స్ సమావేశానికి జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 10 వేల మందిని నేతలు తరలిరావాలని కేటీఆర్ అన్నారు. ఫిబ్రవరి 13న జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా క్యాడర్ మీట్ నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని నేతలకు సూచించారు. ఇతర జిల్లాలకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను ఒక్కో నియోజకవర్గానికి ఇంచార్జుగా నియమించి ఫిబ్రవరి 13 నుంచి ఫిబ్రవరి 17 వరకు సెగ్మెంట్లలోనే ఉంటారు.తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఫిబ్రవరి 17న కొత్త సచివాలయాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పుడు ఈ భారీ వేడుక అర్థాంతరంగా వాయిదా వేయాల్సి వచ్చింది. అనేక కోట్ల రూపాయలకు పైగా అంచనాతో నిర్మించిన ఈ సచివాలయానికి భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టనున్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్, ఫిబ్రవరి 11:పేదలు, మధ్యతరగతి వారికి ఉచిత ఆయుర్వేద వైద్యం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ద్వారా ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఖైరతాబాద్ ప్రేమ్ నగర్ అంబేద్కర్ భవనంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. నెహ్రూ యువ కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ ద్వారా ఫ్రీ ఆయుర్వేద మెగా హెల్త్ క్యాంప్ శనివారం ప్రారంభించి ఉచిత ఆయుర్వేద మందులను మేయర్ అందజేశారు. మెగా హెల్త్ క్యాంప్ లో జనరల్ మెడిసిన్స్ ఆర్థోపెడిక్ కార్డియాలజీ గ్యాస్ట్రో ఎంటిరాలజీ ఈఎన్ టి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మేయర్ స్వయంగా వైద్య శిబిరంలో పాల్గొని పరీక్ష నిర్వహించుకున్నారు. జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులు కూడా వైద్య శిబిరంలో పాల్గొని చికిత్సలు చేయించుకున్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో నవ్య శ్రీ సామాజిక సేవ సమితి గ్లెన్ ఈగల్స్ గ్లోబల్ హాస్పిటల్ వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

వందేళ్లలో ఇదే అత్యంత తీవ్రమైన భూకంపం: ఐక్యరాజ్యసమితి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:టర్కీ-సిరియా సరిహద్దులో ఈ నెల 7వ తేదీ తెల్లవారుజామున సంభవించిన భూకంపం చాలా తీవ్రమైనదని, గత వందేళ్లలో ఆ ప్రాంతంలో ఇంతటి తీవ్రమైన భూకంపం సభవించడం ఇదే మొదటిసారి అని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది. ఇవాళ టర్కీలోని భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఐరాస అత్యవసర, సహాయక చర్యల చీఫ్ మార్టిన్ గ్రిఫిత్స్.. ఖహ్రమా ఓన్‌మరాస్ ప్రావిన్స్‌లో మీడియాతో మాట్లాడారు.అదేవిధంగా టర్కీ ప్రభుత్వం నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ చర్యలపై గ్రిఫిత్స్ ప్రశంసలు కురిపించారు. విపత్తు నిర్వహణ చర్యల విషయంలో టర్కీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అసాధారణంతా ఉందని ఆయన కొనియాడారు. సిరియాలో కూడా ప్రభుత్వ ఆధీనంలో, ప్రభుత్వ వ్యతిరేకుల ఆధీనంలో ఉన్న రెండు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని భావిస్తున్నానని, అయితే ఈ విషయంలో తనకు పూర్తిగా క్లారిటీ లేదని ఆయన చెప్పారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ నామినేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 11: శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. బండ ప్రకాశ్ వెంట మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసుధానాచారి, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు ఉన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్ పేరును బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఖరారు చేసిన విషయం తెలిసిందే.

మండలి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించిన ఎమ్మెల్సీ నేతి విద్యాసాగర్ పదవీకాలం 2021, జూన్ 3న పూర్తయింది. దీంతో అప్పటినుంచి డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీగా ఉన్నది. ఈనేపథ్యంలో డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు శుక్రవారం నోటిఫికేషన్ వెలువడింది. ఆదివారం ఉదయం 10 గంటలకు శాసన మండలి ప్రారంభమైన తర్వాత డిప్యూటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పూర్తిచేసయనున్నారు. అనంతరం బాధ్యతలు అప్పగిస్తారు.

దేశంలో రాయితీపై రొయ్య పిల్లలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ: మంత్రి తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 11:: రాష్ట్రంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దేశంలో సబ్సిడీమీద రొయ్య పిల్లలను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలన్నారు. శాసన సభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు అడిన ప్రశ్నలకు మంత్రి తలసాని సమాధానం ఇచ్చారు. 2021-22లో 4.4 టన్నుల చేపల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంటే.. 3.89 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించామని తెలిపారు. 2022-23లో 4.67 లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2021-22లో 23,263 నీటి వనరుల్లో చేప పిల్లలను వదిలగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 23,748 నీటి వనరుల్లో చేప పిల్లలను వదిలామని చెప్పారు.

చేపల మార్కెటింగ్ కోసం మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గతంలో 647 సొసైటీలు ఉండగా, ఇప్పుడు వాటిని 5112కు పెంచుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది కొత్తగా లక్ష మందికి సభ్యత్వం ఇచ్చామన్నారు.

అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి-బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

చెన్నైఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్).;: బీజేపీ పార్టీ, బీజేపీ ప్రభుత్వం ఎలాంటి అవినీతికి, అక్రమాలకు పాల్పడకపోతే, అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఎందుకు వేయడం లేదని, అక్రమాలకు పాల్పడ్డ కంపెనీని ఎందుకు రక్షిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.హామీలు అమలుచేయడంలో విఫలమై, భారతదేశం పేరు అంతర్జాతీయ స్థాయిలో మసకబారేందుకు కారణమైన బీజేపీ 2024 లో గెలిచే అవకాశాలు ఏమాత్రం లేవని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. చెన్నైలో ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వహించిన '2024 ఎన్నికలు-ఎవరు విజయం సాధిస్తారు?' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు.పారదర్శకత, నిబద్ధతతో పాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ పార్టీ, రెండు సార్లు అధికారంలో ఉండి చెప్పిన వాటిని పాటించలేదని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కావున మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి కొత్తవారికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత పదేళ్లలో ప్రధానిగా మోదీ ఏం చేసారని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారి దేశవ్యాప్తంగా భావసారుప్యత ఉన్న ప్రతిపక్ష పార్టీలను ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

2014లో 11 కోట్ల 47 లక్షల మందికి పీఎం కిసాన్ పథకం ఇస్తామని ప్రారంభించి ఈ ఏడాది కేవలం 3 కోట్ల 80 లక్షల రైతులకు మాత్రమే ఇచ్చారని, కానీ ఈ ఏడాది కూడా 11 కోట్ల మంది రైతులకు పథకం అమలు చేసామని ప్రధాని మోదీ పార్లమెంటులో అబద్ధాలు చెప్పారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటులోనే 50 వేలకు పైగా రైతులను కేంద్ర కిసాన్ పథకం నుండి తొలగించారన్నారు. దేశవ్యాప్తంగా 8 కోట్ల కుటుంబాలు త్రాగునీరు ఇస్తున్నామని చెప్పిన మోదీ, రాజ్యసభలో మాత్రం 11 కోట్ల కుటుంబాలకు ఇస్తున్నామని అసత్యాలు చెప్పారన్నారు. పార్లమెంటులో గంటన్నర సేపు మాట్లాడిన ప్రధాని మోదీ, అదానీ కుంభకోణంపై ఎందుకు మాట్లాడలేదని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.

చిన్నచితక వ్యాపారాలకు రుణాలు ఇచ్చి ఆదుకోండి

-ప్రభుత్వానికి బిసి నాయకురాలు మట్టా జయంతి గౌడ్ విజ్ఞప్తి

హైదరాబాద్ ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీసీలకు బడ్జెట్ లో 6.229 కోట్లు కేటాయించడం జరిగింది దానిలో బీసీ సబ్సిడీ లోన్స్ కి దాదాపుగా 5 లక్షల 77 వేల మంది నమోదు చేసుకున్నారు కానీ 40 వేల మందికి మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని బిసి నాయకురాలు మట్టా జయంతి గౌడ్ పేర్కొన్నారు. ఇంకా 5,37,000 మందికి ఎలాంటి లోన్స్ కేటాయించలేదు చాలా సందర్భాలలో ప్రభుత్వానికి కూడా 7 8 సంవత్సరాల నుండి విన్నవించుకున్నప్పటికి ప్రభుత్వం స్పందించలేదని,ఇలాంటి ఇట్టి విషయం లో వెంటనే రాష్ట్ర బీసీ మంత్రివర్యులు గంగుల కమలాకర్ చొరవ తీసుకొని వెంటనే మహిళలకి రుణాలు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.మహిళలు ఇంట్లో ఉండే చిన్నచితక వ్యాపారాలు చేసుకోవడం రుణాల గురించి అప్లికేషన్ పెట్టుకోవడం జరిగింది ఇప్పటికైనా ప్రభుత్వం వాళ్లకి రుణాలు వెంటనే కేటాయించి వాళ్లు ఆత్మ గౌరవంగా బ్రతకడానికి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని జయంతి గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

పొదుపుకు, పిసినారితనానికి తేడా నేర్పలేమా..!

గత మూడు సంవత్సర కాలంగా కరోనా విధించిన లాక్‌డౌన్లు, అప్రకటిత కర్ఫ్యూ, ఉక్రెయిన్ రష్యా యుద్ధంతో ఆర్థిక మాంద్యం, అధిక ద్రవ్యోల్బణం లాంటి సామాజిక అనివార్యతల నడుమ ప్రజలు కష్టంతో భవసాగరాలను ఈదుస్తూ ఉన్నారు. వ్యాపారాలు, వృత్తులు, ఉపాధులు, ఉద్యోగాలు, పని పాటలు మంగించాయి. పేదలకు కనీస అవసరాలు అందని ద్రాక్షలే అయ్యాయి. బతకడం భారమౌతున్నది. ఆర్థికంగా చితికిన జీవులు బక్కచిక్కి పోయారు. రెక్కాడందే డొక్క నిండేదెలా అనే పశ్నకు సమాధానం తెలియని దుస్థితిలో నవయుగ నరుడు సతమతం అవుతున్నాడు. పేద ధనిక వర్గాలు తమ ఆదాయాలను అనాలోచితంగా, అర్థరహితంగా చేసే విచ్చలవిడి దినసరి అనవసర ఖర్చుల పట్ల సరైన అవగాహన ఉండడం లేదు. నేటి ఆదాయం రేపటికి పుణాది కావాలనే ఇంగిత జ్ఞానం కరువైంది. ఆర్థిక క్రమశిక్షణ లోపించడంతో కుటుంబాల్లో అశాంతి రాజ్యమేలుతున్నది. పిల్లల నుండి పెద్దల వరకు ఆదాయ వ్యయాల పట్ల లోతైన అవగాహన ఉండడం లేదు. ఎంత సంపాదిస్తున్నావన్నది ముఖ్యం కాదని, ఎలా ఖర్చు చేస్తున్నామనేదే ప్రధానమని తెలియని సంకట స్థితుల్లోంచి బయట పడడం బహుకష్టంగా తోస్తున్నది.

విద్యావిధానంలోనే ఆర్థిక అక్షరాస్యత పాఠాలు :

ఆర్థిక క్రమశిక్షణ గూర్చి మనలో చాలా మందికి తెలియదు. మన విద్యా వ్యవస్థలో ఆర్థిక అక్షరాస్యత బోధనలకు చోటే లేదు. మె?క్కె వంగనిదే మానై వంగదు కదా. లేత మనసులకు ఆర్థిక జ్ఞానాన్ని నేర్పే వెసులుబాటుకు నేటి విద్యావిధానంలో తావే లేదు. ఆర్థిక క్రమశిక్షణను చిన్నతనం నుండే బోధించడంతో పెరిగి పెద్దవాడైనపుడు కుటుంబ పోషణలో స్థిరత్వం, సంతోషాలను ప్రసాదించగలడని ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. మన విద్యా విధానం డిగ్రీలను, నైపుణ్యాలను అందిస్తూ యువతకు ఉద్యోగ ఉపాధులను చూపవచ్చు. ఉద్యోగం పొందిన తరువాత లభించే పరిమిత వేతనంతో సంసారాన్ని సజావుగా నడపడం తెలియని యువ సంస్కృతిని మనం నేడు ఆశ్చర్యపడుతూ చూస్తున్నాం. ఉన్నపుడు ఎగిరి పడడం, లేనప్పుడు కుంగి పోవడం సాధారణం అయ్యింది. అప్పులు చేయడం, ఆడంబరాలకు అర్రులు చాచడంతో ఆర్థిక సమస్యలు పెరిగి ఆత్మహత్యలు చేసుకోవడం సాధారణ అంశంగా మారుతోంది. ప్రాధాన్యతలను మరిచి విచక్షణారహితంగా ఖర్చు చేయడం, కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలియక పోవడం నేటి యువత జీవనశైలిలో భాగం అయ్యింది. మన పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్ అక్షరాస్యత వలె ఆర్థిక అక్షరాస్యతను నేర్పించే ఏర్పాటు చేయకపోవడం విచారకరం. నేటి ఆర్థిక స్థిరత్వమే రేపటి ఊహించని సమస్యలకు సమాధానమని తెలపాల్సిన అవసరం ఉంది. చాప ఉన్నంత వరకే కాళ్ళు మలుచు కోవాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి. డబ్బు ఉన్నపుడే రేపటి గూర్చి ప్రణాళికలు వేసుకోవాలి. ప్రమాదాలు చెప్పి రావు. అనారోగ్యాలు అడిగి దరి చేరవు. కరోనాలు హెచ్చరించి ప్రవేశించవు. అనుకోని అసౌకర్యాలను/అవాంతరాలను అధిగమించడానికి నిన్న ఆదా చేసిన విత్తమే నేడు మనల్ని కాపాడుతుంది.

ఆదా చేయడానికి, పిసినారితనానికి వ్యత్యాసం నేర్పాలి:

చిన్నపిల్లలు చిల్లర (పాకెట్ మనీ) డబ్బులు దాచుకునే గళ్ళ గురిగి మనకు గుర్తుంది. పిల్లలకు డబ్బుల ప్రాధాన్యతల్ని, ఖర్చు చేసే విధానాన్ని, ఆదా చేయవలసిన అవసరాన్ని పాఠాలుగా మనసుకు ఎక్కించాలి. ఆదా చేయడానికి, పిసినారితనానికి వ్యత్యాసం వివరించాలి. ఆదాయంలో కొంత సొమ్మును ఆదా లేదా మదుపు చేయడం వల్ల వ్యక్తికి, కుటుంబానికి రేపటి పట్ల భయం తొలగడం, ప్రతికూల సమయాల్లో బయట పడగలమనే ధీమా కలిగి, గృహ భద్రత, ఆరోగ్యకర వాతావరణం నెలకొంటాయని తెలుసుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణను పిల్లలకు తెలపడం మన కనీస బాధ్యతగా గుర్తించాలి. డబ్బును సక్రమంగా నిర్వహించడం వ్యక్తిగత అంశమని, మన అలవాట్లతో వ్యయానికి సంబంధం ఉంటుందని వివరించాలి. ప్రేమ పేరుతో తల్లితండ్రులు పిల్లలకు విచ్చలవిడిగా డబ్బును అందుబాటులో ఉంచితే, వారికి అనాలోచితంగా వృధా ఖర్చు చేయడం మాత్రమే అలవాటు అవుతుంది. ఇలాంటి అలవాటు కలిగిన పిల్లలు ఎదిగిన తరువాత కుటుంబాన్ని సజావుగా నిర్వహించడం కష్టం అవుతుంది. ఆదాయంలో కొంత సొమ్ము ఆదా చేయవలసిందే అని చిన్నతనం నుంచే నేర్పాలి. ఉద్యోగులు తమ వేతనాన్ని కుటుంబం గడవడానికి, పిల్లల విద్యకు వినియోగించాల్సిందే. ఉద్యోగంలో చేరిన రోజే పదవి విరమణ తేదీ నిశ్చయమైందని చాలా మంది మరిచి పోతారు.

నేటి ఆదాయం రేపటికి భరోసా ఇవ్వాలి:

నేటి ఆదాయం రేపటికి భరోసాను ఇవ్వాలి. మన వృత్తిలో ఎదుగుదల, వైవాహిక జీవితం, స్వంత ఇల్లు నిర్మించుకోవడం, అనుకోని ప్రమాదాలను ధైర్యంగా ఎదురుకోవడం, పిల్లలకు ఉత్తమ ఉన్నత విద్యను అందించడం, వాహనాల నిర్వహణ లాంటి అనేక అంశాలు ఆర్థిక అక్షరాస్యతపైననే ఆధారపడి ఉంటాయని మరువరాదు. చిరుప్రాయంలో అనుభవం, విషయ పరిజ్ఞానం తక్కువగా ఉంటాయి. తెలియక పోవడం క్షంతవ్యం కాదని, తెలుసుకోవడం మన కనీస బాధ్యతని నేర్పించాలి. ఆర్థిక క్రమశిక్షణ లోపించిన కుటుంబంలో అశాంతి, అనారోగ్యకర వాతావరణం, భవిష్యత్తు పట్ల అనిశ్చితి, ఇంట్లో గొడవలు, మానసిక ఒత్తిడి, కుటుంబ పోషణలో ఇబ్బంది, పిల్లల పెంపకంలో అశ్రద్ధ లాంటి సమస్యలు అనునిత్యం వెంటాడుతూ ఉంటాయి. ఆరోగ్యకర జీవన విధానానికి ఆర్థిక అక్షరాస్యతే పుణాది కావాలి. బడిలో పాఠ్యాంశాలతో పాటు ఆనందకర ఆరోగ్యకర జీవనశైలి అంశాలైన మంచి అలవాట్లు, మానవీయ విలువలు, వ్యక్తిగత నైపుణ్యాలు, కంప్యూటర్ అక్షరాస్యత, ఆర్థిక క్రమశిక్షణలు లాంటి అంశాలను బోధించాలి. సకల విలువల విత్తులు నాటే క్షేత్రాలు తరగతి గదులే కావాలి. ఆస్తిపాస్తులను పెంచడం కన్న సంతానానికి విలువలతో కూడిన పరిపూర్ణ జీవనశైలిని అందించే కృషి చేయాలి. నేటి బాలలే రేపటి పౌరులు, నేటి హిత బోధనలే రేపటి సంతోషాలకు కారణాలని మన పిల్లలకు నేర్పుదాం. నేటి ఆర్థిక అక్షరాస్యతే రేపటి కుటుంబ సభ్యుల ఆనందానికి పెట్టుబడి అని వివరిద్దాం. ఆకర్షణీయ జీతానికి, ఆనందమయ జీవితానికి [illegible]ాన్ని నేర్పిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అంతర్జాతీయ సదస్సు మైనింగ్ ఇండాబాలో భారతీయ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన మంత్రి రావ్‌సాహెబ్ పాటిల్ దాన్వే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:ప్రతి ఏడాది దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌లో జరిగే మైనింగ్ సదస్సుల్లో మైనింగ్ ఇండాబా అన్నది అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ ఏడాది భారత ప్రభుత్వ ప్రతినిధి బృందం గనులు, బొగ్గు ఉ రైల్వేల శాఖ సహాయమంత్రి శ్రీ రావ్ సాహెబ్ పాటిల్ దాన్వే నేతృత్వంలో ఈ ఏడాది సదస్సులో పాల్గొంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ గనులుఉశ్రామిక విభాగం మంత్రి శ్రీ బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రతినిధి బృందంలో గనులు, బొగ్గు, స్టీల్ మంత్రిత్వ శాఖలు, విదేశాంగ శాఖ / జీఎస్ఐ, ఎఎండి, హెచ్‌సిఎల్, ఎన్ఎఎల్‌సిఐ, ఎన్ఎండిసి, సిఐఎల్, ఎస్ఎఐఎల్, ఎంఐఐఎల్, ఎంఇఎల్, ఎన్‌టిపిసి, ఒఎంసి సంస్థలు అధికారులు కూడా ఉన్నారు.

భారతీయ మైనింగ్ ఉ ఖనిజ రంగ శక్తిని ప్రదర్శిస్తూ సదస్సు జరిగిన ప్రదేశంలో ఆకర్షణీయమైన భారతీయ పెవిలియన్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశంలో పెట్టుబడి అవకాశాలు అన్న ఇతివృత్తంతో ఏర్పాటు చేసిన ఈ పెవిలియన్‌ను గనులు, బొగ్గు ఉ రైల్వేల శాఖ సహాయ మంత్రి, మధ్యప్రదేశ్ ప్రభుత్వ గనులుఉశ్రామిక విభాగం మంత్రి 6 ఫిబ్రవరి 2023న ప్రారంభించారు. దాని నమూనా, విషయాలను అంతర్జాతీయ ప్రతినిధులు అత్యంతగా ప్రశంసించారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం చేపట్టిన పలు చొరవలు, సంస్కరణలను పట్టిచూపే గనుల మంత్రిత్వ శాఖ బ్రోచర్‌ను, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వేలం వేయనున్న ఖనిజ బ్లాకులతో కూడిన బుక్‌లెట్‌ను అక్కడ పంచడం జరిగింది. సదసు?స సందర్భంగా సౌదీ అరేబియా, నైజీరియా, కాంగో, జాంబియాతో మంత్రిత్వ స్థాయి ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. భారతీయ ప్రతినిధి బృంద సభ్యులు, వివిధ దేశాలు, సంస్థలకు చెందిన ప్రతినిధుల మధ్య అనేక చర్చలు, సంభాషణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దక్షిణాఫ్రికాలోని భారతీయ హై కమిషనర్, కేప్‌టౌన్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా పాలుపంచుకొని, కేప్ టౌన్‌లో భారత ప్రభుత్వ భాగస్వామ్యాన్ని విజయవంతం చేసేందుకు తోడ్పాటు నందించారు. మంత్రి శ్రీ దాన్వే 8 ఫిబ్రవరి రోజున అంతర్జాతీయ శ్రోతలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మైనింగ్, ఖనిజ రంగంలో ప్రభుత్వం చేపట్టిన చొరవలను పట్టి చూపుతూ, భారత్‌లో పెట్టుబడులు పెట్టవలసింది విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ వ్యవస్థ ఒకదానికొకటి విరుద్ధం కాదు ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:భారతదేశం అధ్యక్షతన ఈ రోజు బెంగళూరులో జరిగిన జీ- 20 పర్యావరణ మరియు వాతావరణ సుస్థిరత వర్కింగ్ గ్రూప్ మొదటి సమావేశానికి జీ-20 దేశాలు, అతిథి దేశాలు, అంతర్జాతీయ సంస్థలు, ఇతర ప్రముఖులకు వీడియో సందేశం ద్వారా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి స్వాగతం పలికారు.

భూకంపం వల్ల తీవ్రంగా నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న టర్కీ దేశ ప్రజలకు సానుభూతి తెలిపిన శ్రీ పూరి కష్టకాలంలో డ్ దేశ ప్రజలకు భారతదేశం అండగా ఉంటుందని అన్నారు. మానవతా దృక్పథంతో టర్కీ దేశానికి భారతదేశం అండగా ఉండి అవసరమైన మానవతా , వైద్య సహాయాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. కష్ట కాలంలో టర్కీ దేశానికి ప్రపంచ దేశాలు,ప్రజలు అండగా ఉండడం పట్ల శ్రీ పూరి హర్షం వ్యక్తం చేశారు.ఒకరికి ఒకరు అండగా నిలవాలన్న స్ఫూర్తితో జీ-20 సమావేశం జరుగుతుందని అన్నారు. ఈ ఏడాది 'వసుధైవ కుటుంబకం – ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే నినాదంతో జీ-20 పని చేస్తుందని అన్నారు. సార్వజనీన ఏకత్వ భావన ను పెంపొందించడానికి ప్రతినిధులందరూ సమావేశమయ్యారని ఆయన చెప్పారు. గతంలో కంటే ఇప్పుడు అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేస్తూ శ్రేయస్సు, సంక్షేమం పెంపొందించే సమ్మిళిత, ప్రతిష్టాత్మక, కార్యాచరణ ఆధారిత ఎజెండాకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

పర్యావరణం, సుస్థిర పర్యావరణ అభివృద్ధిపై ఏర్పాటైన వర్కింగ్ గ్రూప్ సమావేశంలో శ్రీ పూరి ప్రసంగించారు. క్షీణిస్తున్న జీవవైవిధ్యం, పర్యావరణం వల్ల అనవసర ఖర్చులు పెరుగుతున్నాయని, జీవితంలో సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడుతున్నాయని మంత్రి అన్నారు. వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నాశనం వల్ల కలుగుతున్న నష్టాన్ని భర్తీ చేయడానికి ప్రపంచవ్యాప్తంగా సమిష్, క్రమబద్ధమైన చర్యలు అమలు జరగాలన్న అభిప్రాయాన్ని శ్రీ పూరి వ్యక్తం చేశారు.

ప్రపంచ జీడీపీలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండొంతుల వాటా కలిగిన ఉన్న జీ-20 దేశాలు నిబద్ధత, దూరదృష్టితో పనిచేయాల్సి ఉంటుందని అన్నారు.

సమస్య పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు ముఖ్యంగా గ్లోబల్ సౌత్ జీ -20లో జరిగే చర్చలు, అమలు చేసే కార్యక్రమాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయని శ్రీ పూరి పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలను వాతావరణ సంక్షోభం, రుణ సంక్షోభం నుంచి రక్షించడానికి జీ-20 దేశాలు ఏకాభిప్రాయంతో పని చేయాలని ఆయన కోరారు.

గ్లోబల్ సౌత్ దేశాల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి భారతదేశం సిద్ధంగా ఉందని శ్రీ పూరి అన్నారు.పర్యావరణ పరిరక్షణ కోసం గత ఎనిమిదేళ్లలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు.

భారత్‌ను స్వావలంబన దేశంగా మార్చే లక్ష్యంతో వాహన & వాహన విడిభాగాల పరిశ్రమ కోసం, 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:వాహన ఉ వాహన విడిభాగాల పరిశ్రమ కోసం, 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజ్' కోసం రెండు ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాలను భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రారంభించిందని ఆ శాఖ సహాయ మంత్రి శ్రీ క్రిషన్ పాల్ గుర్జార్ ఈ రోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం రూపంలో వెల్లడించారు.

వాహన ఉ వాహన విడిభాగాల పరిశ్రమ కోసం పీఎల్ఐ పథకం:– వాహన ఉ వాహన విడిభాగాల రంగంలో భారతదేశ తయారీ సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో ఈ రంగానికి 'పీఎల్ఐ స్కీమ్ ఫర్ ఆటో మొబైల్ ఉ ఆటో కాంపోనెంట్ ఇండస్ట్రీ' పేరిట పీఎల్ఐ పథకాన్ని కేంద్ర ప్రభు త్వం ఆమోదించింది. 5 సంవత్సరాల కాలానికి (ఈజ2022 -23 - ఈజ2026-27) మొత్తం రూ.25, 938 కోట్ల బడ్జెట్ కేటాయింపు లతో ఈ పథకాన్ని ఆమోదించింది. ఈ ఐదేళ్లలో ఆశించిన ఉపాధి కల్పన, అర్హత కల అమ్మకాల్లో సంచిత పెరుగుదల అంచనా వరుసగా 1.45 లక్షలు (ప్రత్యక్ష ఉపాధి), ?2,31,500 కోట్లు. ఈ పథకం వివరాలను https://heavyindustries.gov.in/UserView/index?mid=2482 లింక్ ద్వారా చూడవచ్చు నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజ్ కోసం పీఎల్ఐ పథకం:– భారతదేశం లో అత్యాధునిక రసాయన బ్యాటరీల (ఏసీసీ) ఉత్పత్తి సామర్థ్యాలను మెరుగుపరిచేలా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం పీఎల్ఐ పథకాన్ని ఆమోదించింది. మొత్తం 7 సంవత్సరాలకు (రెండు సంవత్సరాల ఏర్పాటు కాలంతో సహా) రూ.18, 100 కోట్ల కేటాయింపులు చేసింది. లబ్ధిదారు సంస్థ సాధించాల్సిన మొత్తం అంచనా పెట్టుబడి రూ.27, 000 కోట్లు. ఈ పథకం ద్వారా 2.7 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఈ పథకం వివరాలను https://heav yindustries.gov.in/User View/index?mid=2482లో చూడవచ్చు. ఆత్మనిర్భర్ భారత్ దృష్ట్యా, భార త దేశాన్ని స్వావలంబన కలిగిన దేశం గా మార్చడానికి వాహన ఉ వాహన విడిభాగాల పరిశ్రమ కోసం, 'నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజ్' కోసం పీఎల్ఐ పథకాలను మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. భారతదేశం లో త యారైన ఉత్పత్తులకు దేశీయ విలువ జోడింపు (డీవీఏ) కోసం ఈ పథకా లను ఆమోదించింది. వాహన పీఎల్ ఐలో, ప్రోత్సాహకం పొందడా నికి కనీసం 50% డీవీఏ అవసరం. ఏసీసీ పీఎల్ ఐ పథకంలో, లబ్ధిదారుల సంస్థలు రెండో సంవత్సరం చివరి నాటికి కనీసం 25% డీవీఏ, ఐదో సంవత్స రం ముగిసే నాటికి 60% సాధించాలి.

తాత్కాలిక రిజిస్ట్రేషన్ ద్వారా పూర్తిగా నిర్మించిన వాహనాలను దివ్యాంగులకు అనుకూలంగా మార్చడాన్ని సులభతరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:తాత్కాలిక రిజిస్ట్రేషన్ ద్వారా పూర్తిగా నిర్మించిన వాహనాలను దివ్యాంగులకు అనుకూలంగా మార్చడాన్ని సులభతరం చేసేందుకు రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ (ఎంఒఆర్‌టిహెచ్) జి.ఎస్.ఆర్. 90(ఇ) ని ముసాయిదా నోటిఫికేషన్‌ను 9 ఫిబ్రవరి 2023న జారీ చేసింది.

దివ్యాంగుల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా మోటారు వాహనాలను మార్చడం అన్నది వారి చలనశీలతను సులభతరం చేసేందుకు అవసరం అవుతుంది. ప్రస్తుతం, అలా మార్చడం అన్నది ఉత్పత్తిదారు లేక వారి అధికారిక డీలరు వాహన రిజిస్ట్రేషన్‌కు పూర్వమే చేసేవారు లేదా నమోదు చేసుకునే అధికారిక సంస్థ అనుమతి ఆధారంగా వాహన రిజిస్ట్రేషన్‌ను యాజ్- ఈజ్ పద్ధతిలో చేసేవారు.

ఈ ప్రక్రియనను సులభతరం చేసేందుకు, మోటారు వాహనాలను తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఆధారంగా మార్చే సౌకర్యాని?న అందుబాటులోకి తేవడం కోసం 53ఎ, 53 బిలో సవరణలు తేవాలని ఎంఒఆర్‌టిహెచ్ ప్రతిపాదనలు చేసింది.

సవరించిన నిబంధనలకు సంబంధించిన కీలకాంశాలు ఈ విధంగా ఉన్నాయిః

1. నిబంధన 53ఎలో మార్చవలసినన పూర్తిగా నిర్మించిన మోటారు వాహనాలను కూడా కలిపేందుకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునే కారణాలను విస్తరించింది.
2. నిబంధన 53బిలోని సబ్ రూల్ 2లో ఒక అంశాన్ని జోడించేందుకు ప్రతిపాదించింది. అది, పూర్తిగా నిర్మించిన మోటారు వాహనాలను అవసరాలకు అనుగుణంగా మార్చేందుకు, డీలర్ ఉన్న రాష్ట్రం కాకుండా మరొక రాష్ట్రంలో వాహనాన్ని రిజిస్టర్ చేస్తున్నప్పుడు వారికి సౌలభ్యం కల్పించేందుకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ 45రోజులపాటు చెల్లుతుంది.

ఈ సవరణలు దివ్యాంగులు మోటారు వాహనాలను నడపడాన్ని మరింత సులభతరం చేస్తాయని అంచనా. దీనిపై అందరు భాగస్వాముల నుంచి వ్యాఖ్యలను, సూచనలను ముప్పైరోజుల లోపు పంపవలసిందిగా ఆహ్వానించడం జరిగింది.

ఓబీసీ నాన్‌క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని పెంచేదిలేదనడం అన్యాయం

ప్రధానమంత్రికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం బహిరంగ లేఖ.

ప్రస్తుతం అమలులో 8లక్షలు ఉన్న సీలింగ్ "సంతృప్త స్థాయి"లో ఉందనడం బీసీలపై కేంద్రం నైజానికి నిదర్శనం.

ఓపిటి నిబంధనలను, జాతీయబీసీ కమిషన్, ఓబీసీ పార్లమెంటరీ స్థాయి సంఘం సిఫారసులను పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

అసలు ఎన్‌సీబీసీ సిఫారసులే చేయలేదని చెప్పడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడం, బీసీలకు తీరని నష్టం కల్గించడమే.

హైదరాబాద్ ఫిబ్రవరి 11 (ఎక్స్‌ప్రెస్ న్యూస్);ఓబీసీలకు గత ఏడేళ్లుగా అమలులో ఉన్న నాన్ క్రిమిలేయర్ 8లక్షల ఆదాయ పరిమితి 'సంతృప్త స్థాయి'లో ఉందని, ఈ పరిమితిని పెంచాల్సిన అవసరం లేదని కేంద్రం ప్రకటించడం బీసీలకు తీరని అన్యాయం చేయడమే నని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు పేర్కొన్నారు. ఈమేరకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి బహిరంగలేఖ రాసారు. కేంద్ర ప్రభుత్వ డిఓపిటి నిబంధనలను, జాతీయ బీసీ కమిషన్, ఓబీసీ పార్లమెంటరీ స్థాయి సంఘం సిఫారసులను కూడా పరిగణలోకి తీసుకోకపోవడం, పైగా ఆదాయ పరిమితిని పెంచే ఆలోచన కేంద్రానికి లేదని ప్రకటించడం దుర్మార్గమని పేర్కొన్నారు.

లోక్‌సభలో కేంద్ర, సామాజిక న్యాయ సాధికారికత మంత్రి డా? వీరేంద్రకుమార్ ఈ విధంగా తెల్పడం పట్ల తీవ్రనిరసన వ్యక్తం చేసారు. 2015లో జాతీయ బీసీ కమిషన్ నాన్‌క్రిమిలేయర్ స్థితిని నిర్ణయించడానికి ప్రస్తుతం కూడా అమలులో ఉన్న ఆదాయ పరిమితిని 8లక్షల నుండి 15లక్షలకు పెంచాలని సిఫారసు చేసింది. అందుకు అనుగుణంగా ఒక నివేదికను కేంద్రానికి పంపింది. కాగా ఆనాటి సిఫారసులు తమ పరిశీలనలో లేవని కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ చెప్పడం సభను తప్పుదోవ పట్టించడం బీసీలకు ప్రగతిని నిరోధించడమే నని పేర్కొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్లు కేంద్రంలో అమలులోకి వచ్చినప్పటి నుండి డిఓపిటి, ఎన్‌సీబీసీలు సమీక్షించి సిఫారసులు చేసిన దరిమిలా అన్ని ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొంత జాప్యం చేసినప్పటికీ, ఆదాయ పరిమితిని పెంచుతూ వచ్చాయి. 1993 నుండి ఒకలక్ష పరిమితితో ఆరంభమైన ఈ విధానం 8 లక్షల వరకు చేరుకుంది. ఈ పరిమితి 2017లో స్థిరీకరించడం జరిగింది. డిఓపిటి నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్ళకొకసారి ఆదాయ పరిమితిని సమీక్షించాల్సి ఉంటుంది. అలా పరిశీలించినప్పుడు ఇప్పటికే 2020 నాటికి ఒక గడువు, 2023లో మరో గడువు ముగియనుంది. కాగా పరిమితి పెంపుకోసం చాలానాళ్ళుగా నిరీక్షిస్తున్న ఓబీసీల ఆశలను అడియాశలు చేస్తూ కేంద్రం పెంపుదల చేయబోమని ప్రకటించడం పట్ల బీసీలు నిరాశకు గురౌతున్నారు. ఏ ఆధారం, సమీక్ష నిర్వహించకుండా గతంలోని 8 లక్షల ఆదాయ పరిమితి సంతృప్త స్థాయిలో ఉందని కేంద్ర మంత్రి ప్రకటించడం, బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఏళ్ళతరబడిగా ఓబీసీలు చేస్తున్న డిమాండ్‌లను కేంద్రం పెడచెవిన పెడుతూనే ఉంది. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. బీసీలకు అండగా నిలబడి బరోసానిచ్చే రాజ్యాంగబద్ధమైన జాతీయ బీసీ కమిషన్‌కు ఒక ఛైర్మన్‌ను మాత్రమే నియమించి, వైస్‌ఛైర్మన్, సభ్యులను నియమించకపోవడం వలన ఆ సంస్థ ఒక నిరుపయోగమైన వ్యవస్థగా మారిపోయింది. దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోయి, ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రయివేటీకరణ, కార్పోరేటీకరణ పెరిగిపోయింది. వేరశి సామాన్య, మధ్యతంగతి కుటుంబాల జీవితాలు భారంగా మారిపోతు న్నాయి. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితి పెంచడం ద్వారా కొంతమేరకైన అవకాశాలు పొందవచ్చు అని ఎదురుచూస్తున్న ఓబీసీలకు నిరాశే మిగల్చడం, ప్రజాస్వామ్య పాలకులు చేసే పని కాదన్నారు.

దేశంలో 56% జనాభా కల్గిన ఓబీసీల సమస్యలను, వారి కనీస అవసరాలను నెరవేర్చకుండా గాలికి వదిలివేయడం సబబు కాదు. ఓబీసీ వర్గాల నుండి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన శ్రీ నరేంద్రమోడి ఈ వర్గాలకు ఎంతో మేలు చేస్తారని ఎన్నో ఆశలు ఆకాంక్షలు పెట్టుకున్నప్పటికీ ప్రజలు ఇబ్బందుల పాలు కావడం బాధాకరమన్నారు.కేంద్రం తన వైఖరిని మార్చుకొని వెంటనే నాన్ క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని 15లక్షలకు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మెజారిటీ ప్రజలను వారి ఆకాంక్షలను నెరవేర్చకుండా పాలన సాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ప్రజాస్వామ్య మౌలికతకు విఘాతం. ప్రధానమంత్రి గారు తగు చర్యలు తీసుకుంటారని కోరారు.

మండలిపై మక్కువ - స్థానిక సంస్థల టిక్కెట్స్ కోసం వైసిపిలో పోటా పోటీ..



అమరావతి, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో 12 శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని స్థానాలను సొంతంచేసుకునే దిశగా పావులు కదుపుతున్నారు. అయితే, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఖాళీ అవుతున్న 8 స్థానాలు వైసీపీ ఖాతాలోనే పడే అవకాశాలన్నప్పటికీ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజక వర్గాలకు సంబంధించి ప్రతిపక్షాల నుండి గట్టి పోటీ ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఐదు స్థానాలను కూడా ఎలాగైనా సొంతం చేసుకోవాలని వైసీపీ అధిష్టానం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఆస్థానాలకు సంబంధించి ఇప్పటికే బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపింది. అయితే, రెండు రోజుల క్రితం మండలి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. అయితే పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలతోపాటు స్థానిక సంస్థల కోటాలో 8 స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో అధికార వైసీపీ స్థానిక సంస్థలపై ప్రత్యేక దృష్టి సారించింది. 8 స్థానాలకు జరిగే ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం నుండి పెద్దగా పోటీ ఉండన్నప్పటికీ ఆస్థానాలకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని సీఎం జగన్ యోచిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా పార్టీకి విధేయతగా పనిచేసిన వారికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని ఇప్పటికే సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఆదిశగానే నామినేషన్ల సమయం లోపు కసరత్తు పూర్తిచేసి అభ్యర్థులను ఖరారు చేయనున్నారు.

వేడుకగా ఐపీఎస్‌ల పాసింగ్ ఔట్ పరేడ్.. హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా..



హైదరాబాద్, ఫిబ్రవరి 11:హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ ఐపీఎస్ 74వ బ్యాచ్ అధికారుల పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై.. ట్రైనీ ఐపీఎస్‌ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. మోడీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ అంతర్గత భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత ఎనిమిదేళ్లలో వామపక్ష తీవ్రవాదాన్ని అడ్డుకున్నామని, పీఎఫ్ఐ ఉగ్రవాద సంస్థను నిషేధించామన్నారు. దేశంలో శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. ప్రజా ప్రతినిధులు ఐదేళ్లకోసారి ఎన్నికవుతారని అదే బ్యూరోకాట్లు ఒకసారి అపాయింట్ అయితే 30, 35 ఏళ్లపాటు ప్రజా సేవలో ఉంటారన్నారు. నేషనల్ పోలీస్ అకాడమీ నేటితో 75 వసంతాలు పూర్తిచేసుకుంది. 74వ పాసింగ్ ఔట్ పరేడ్‌లో 195 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శిక్షణ పొందారు. 2021 బ్యాచ్ ఐపీఎస్‌లలో 166 ఇండియా, 29మంది ఫారెనర్స్ ఉన్నారు. 37 మంది మహిళా ఐపీఎస్‌లు శిక్షణ పొందారు. ఇప్పటికే 46 వారాల కఠోర శిక్షణ పూర్తి అయ్యింది. మొత్తం ఫీల్డ్ ట్రైనింగ్‌తో కలిపి 105 వారాల పాటు శిక్షణ పొందారు. ఇండోర్, ఔట్ డోర్ కలిపి 17 విభాగాల్లో ప్రత్యేక శిక్షణ అందించారు. అకాడమీ డైరెక్టర్ ఏఎస్ రాజన్ మాట్లాడుతూ.. మరోవైపు ప్రతి ఏడాదికి మహిళా ఐపీఎస్‌లు పెరుగుతూ వస్తున్నారు. ఈ బ్యాచ్‌లో అధికంగా ఇంజనీరింగ్, మెడికల్, సిఏ స్టూడెంట్స్ కూడా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల కు ఏడుగురు ఐపీఎస్‌లను కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణకు ఐదుగురు, ఏపీ కాడర్‌కు ఇద్దరు చొప్పున అధికారులను కేటాయించడం జరిగింది. హైదరాబాద్ వాసి శేషాద్రిరెడ్డిని తెలంగాణకు కేటాయించారు. అవినాష్ కుమార్, శేషాద్రిరెడ్డి, మహేష్ బాబా సాహెబ్, శంకేశ్వర్, శివం ఉపాధ్యాయ తెలంగాణకు కేటాయించగా? ఏపీకి పంకజ్ కుమార్ మీనా, అంకిత్ మహావీర్‌ల కేటాయించారు.

ఉత్తరప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మేళనం 2023ను లక్నోలో ప్రారంభించిన ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు లక్నోలో ఉత్తరప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మేళనం 2023 ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్లోబల్ ట్రేడ్ షోను, ఇన్వెస్ట్ యుపి 2.0ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 అనేది ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్. దీని ద్వారా విధాన నిర్ణేతలు, పరిశ్రమ నాయకులు, అకడమిక్ రంగానికి చెందిన వారు, ప్రపంచ వ్యాప్తంగా గల మేధావులు, నాయకులు, వ్యాపార అవకాశాలపై సమిష్టిగా చర్చించి భాగస్వామ్యాలు కుదుర్చు కుంటారు. ఈ సమ్మేళనం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రధాన మంత్రి స్వయంగా తిలకించారు.

ఈ సందర్భంగా పరిశ్రమకు చెందిన నేతలు మాట్లాడారు. పారిశ్రామిక వేత్త శ్రీ కుమార మంగళం బిర్లా మాట్లాడుతూ, ఇండియా గొప్పగా ఎంటర్‌ప్రెన్యుయర్ డైనమిజాన్ని ప్రదర్శిస్తోందని , ఆవిష్కరణలు చేస్తోందని ఇది క్రెడిట్ ప్రధానమంత్రికి దక్కుతుందని ఆయన అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధానమంత్రి కొత్త శక్తిని ఎక్కించారని ఆయన అన్నారు. శ్రీముఖేష్ అంబానీ మాట్లాడుతూ, ఈఏడాది బడ్జెట్ ఇండియాను అభివృద్ధి చెందిన దేశాల సరసనచేరేందుకు పునాదిని వేసిందని అన్నారు. కాపెక్స్ వ్యయానికి సంబంధించి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం, గణనీయమైన ఆర్థిక ప్రగతికి, సాంఘిక సంక్షేమానికి దోహదపడుతుందని అన్నారు.

ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గొప్ప పరివర్తన సాధించిందని ప్రధానమంత్రి దార్శనికత, వివిధ కార్యక్రమాల అమలులో వారి సునిశిత దృష్టితో నవభారతం రూపుదిద్దుకుంటున్నదని ఆయన అన్నారు.

టాటా సన్స్ ఛైర్మన్ శ్రీ నటరాజన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి దార్శనిక పాలనతో దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందు తున్న ఆర్థిక వ్యవస్థగా దూసుకు పోతున్నదని అన్నారు. "కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాదు, ప్రధానమంత్రి అన్ని రంగాలలో ప్రగతికి వీలుకల్పిం చారు" అని ఆయన అన్నారు.

బడ్జెట్ లో జరిపిన కేటాయింపులు మౌలిక సదుపాయాల అభివృద్ధికి, వినియోగంలో వృద్ధికి వీలు కల్పిస్తుందన్నారు. అలాగే మనం గ్రామీణ రంగంలో వృద్ధిని చూడగలమని అన్నారు. జూరిచ్ ఎయిర్ పోర్ట్ ఆసియా సంస్థ సి.ఇ.ఒ డానియల్ బిర్చెర్ మాట్లాడుతూ, ఇండియా 75 వసంతాల స్వాతంత్ర్య ఉత్సవాలు జరుపుకుంటున్నట్టే , జూరిచ్ విమానాశ్రయం కూడా 75 వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నదని అన్నారు. ఇండియా, జూరిచ్ ఎయిర్ పోర్టులమధ్య ఎంతోకాలంగా ఉన్న బంధం గురించి ఆయన ప్రస్తావించారు. రెండు దశాబ్దాల క్రితమే జూరిచ్ ఎయిర్ పోర్టు బెంగళూరు విమానాశ్రయ అభివృద్ధికి మద్దతునిచ్చినట్టు చెప్పారు. ప్రస్తుతం నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. యమున ఎక్స్‌ప్రెస్ వేతో నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ను నేరుగా అనుసంధానించడం గురించి ఆయన ప్రస్తావించారు. డిక్సన్ టెక్నాలజీస్ ఛైర్మన్ శ్రీ సునీల్ వచాని మాట్లాడుతూ, ఇండియాలో అమ్ముడవుతున్న 65 శాతం మొబైల్ ఫోన్లు అన్నీ ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్నాయన్నారు. ఇందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అద్భుత విధానాలే కారణమని అన్నారు. ఉత్తరప్రదేశ్ మొబైల్ తయారీ హబ్ గా మారడానికి యుపి ప్రభుత్వ అద్భుత విధానాలే కారణమన్నారు. డిక్సన్ టెక్నాలజీస్, సుమారు 100 బిలియన్ డాలర్ల విలువగల మొబైల్ ఫోన్లను ఎగుమతి చేయడానికి ఎదురుచూస్తున్నదని ఆయన అన్నారు.

ఈ సమ్మేళనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఇన్వెస్టర్లకు , పరిశ్రమ నాయకులకు, విధాన నిర్ణేతలకు ప్రధానమంత్రి గా, ఉత్తర ప్రదేశ్ నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యుడిగా సాదర స్వాగతం పలికారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సాంస్కృతిక వైభవానికి, అద్భుత చరిత్రకు, గొప్ప వారసత్వానికి ఆలవాలమని ప్రధానమంత్రి అన్నారు. ఉత్తరప్రదేశ్ సామర్థ్యాన్ని గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ రాష్ట్రానికి వెనుకబడిన ప్రాంతంగా, బీమారు రాష్ట్రంగా, శాంతిభద్రతలు దయనీయంగా ఉన్న రాష్ట్రంగా అనవసర ప్రచారం జరిగేదని అన్నారు. అలాగే గతంలో రోజూ కోట్ల రూపాయల విలువగల కుంభకోణం ఏదో ఒకటి బయటపడుతూ వచ్చేదని అన్నారు. అయితే వాటన్నింటినీ వదిలించుకుని గత ఐదారేళ్లలో ఉత్తరప్రదేశ్ కొత్త గుర్తింపును తెచ్చుకున్నదన్నారు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ నూతన ప్రభుత్వం సుపరిపాలనకు , మెరుగైన శాంతి భద్రతలకు, శాంతి, సుస్థిరతకు పెట్టింది పేరని అన్నారు. "సంపదసృష్టికర్తలకు ఇక్కడ కొత్త అవకాశాలు కల్పించడం జరుగుతోంది" అని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో మెరుగైన మౌలికసౌకర్యాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాలు ఫలవంతమయ్యాయని తెలిపారు.

త్వరలోనే ఉత్తరప్రదేశ్‌రాష్ట్రం 5 అంతర్జాతీయ విమానాశ్రయాలు కలిగిన ఏకైక రాష్ట్రంగా అవతరించనున్నదని అన్నారు. సరకురవాణా కారిడార్? రాష్ట్రాన్ని నేరుగా మహారాష్ట్ర సముద్రతీరంతో అనుసంధానమవుతుందని అన్నారు. సులభతర వాణిజ్యానికి సంబంధించి ఉత్తరప్రదేవ్ ఆలోచనలో అర్థవంతమైన మార్పు వచ్చిందని ప్రధానమంత్రి చెప్పారు. "ఇవాళ ఉత్తర ప్రదేశ్ ఆశావహ దృక్పధానికి, స్ఫూర్తికి మూల ప్రేరణగా నిలుస్తోంది" భారత ఆర్థిక వ్యవస్థ మునుముందుకు దూసుకుపోతుండడం వల్ల ప్రపంచంలోని ప్రతి విశ్వసనీయ గొంతుక ఆశావహంగానే ఉందని ప్రధానమంత్రి అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, కోవిడ్ మహమ్మారి నుంచి ఇతర దేశాలలోని యుద్ధ ప్రభావం నుంచి అద్భుతంగా కోలుకున్నదని అన్నారు.

భారతదేశ యువత, భారతీయ సమాజం ఆలోచనలో ఆకాంక్షలలో గొప్ప మార్పును గమనించినట్టు ప్రధానమంత్రి చెప్పారు. దేశంలోని ప్రతి పౌరుడూ దేశం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోవాలని కోరుకుంటున్నాడని రాగలరోజులలో వికసిత భారతాన్ని దర్శించాలని అనుకుంటున్నారని అన్నారు. భారతదేశ ప్రజల ఆకాంక్షలు ప్రభుత్వాన్ని ముందుకు నడిపించే చోదకశక్తిగా పనిచేస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఊపుతోనే దేశంలో అద్భుత అభివృద్ధికార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర జనసంఖ్యాస్థాయి గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, ఉత్తరప్రదేశ్ కూడా ఆకాంక్షిత సమాజమని అన్నారు. ఇది మీకోసం ఎదురుచూస్తున్నది అని ఇన్వెస్టర్లతో అన్నారు.

డిజిటల్ విప్లవం కారణంగా ఉత్తరప్రదేశ్ సమాజం సమ్మిళితంగా ఎదిగిందని, అనుసంధానత పెరిగిందని అన్నారు. "మార్కెట్‌గా ఇండియా నిరంతరాయత సాధిస్తోంది. విధానాలు సులభతరమవుతున్నాయి '' అని అన్నారు. "ఇవాళ ఇండియా సంస్కరణలు అమలు చేస్తోంది. అయితే వీటిని ఒత్తిడి వల్ల కాక, నిబద్ధతతో చేపడుతోంది'' అని ప్రధానమంత్రి అన్నారు.

ఇవాళ ఇండియా వాస్తవంగా భారీ స్థాయిలో , వేగంగా ముందుకు దూసుకుపోతున్నదని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. పెద్దమొత్తంలోని ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంతో వారు మరింత ముందుకు ఆలోచిస్తున్నారు. ఇండియా పై విశ్వాసానికి ఇదే పెద్ద ఉదాహరణ అని ప్రధానమంత్రి అన్నారు.

బడ్జెటు ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల కల్పన కు కేటాయింపు పెరుగుతున్నట్లు స్పష్టం చేశారు. ఆరోగ్య రంగం లో, విద్య రంగం లో మరియు సోశల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ రంగం లో ఇన్ వెస్టర్ లకు గల అవకాశాల ను గురించి కూడా ఆయన వివరించారు. భారతదేశం అనుసరిస్తున్న గ్రీన్ గ్రోథ్ మార్గం లో లభించే అవకాశాల ను వినియోగించుకోవలసింది అంటూ ఇన్ వెస్టర్ లకు ఆహ్వానం పలికారు. ఈ సంవత్సరం బడ్జెటు లో శక్తి పరివర్తన కు ఒక్కదానికే 35,000 కోట్ల రూపాయల ను కేటాయించడం జరిగింది అని ఆయన తెలియజేశారు.

ఒక సరికొత్త వేల్యూ ఎండ్ సప్లయ్ చైన్ ను అభివృద్ధిపరచే విషయాని కి వస్తే, ఉత్తర్ ప్రదేశ్ ఒక చాంపియన్ గా తెర మీద కు వచ్చింది అని ప్రధాన మంత్రి తెలిపారు. రాష్ట్రం లో సాంప్రదాయికమైనటువంటి మరియు ఆధునికమైనటువంటి సూక్ష్మ, లఘు, మధ్యతరహా వ్యాపార సంస్థల(ఎమ్ఎస్ఎమ్ఇస్) తో కూడిన ఒక హుషారైన నెట్ వర్క్ ఏర్పాటైందని ఆయన ప్రస్తావించి భదోహి పట్టు ను, వారాణసీ పట్టు ను ఉదాహరణ గా పేర్కొంటూ, ఉత్తర్ ప్రదేశ్ ను భారతదేశం లో వస్త్ర కేంద్రం గా ఇవి తీర్చిదిద్దాయన్నారు. భారతదేశం లో 60 శాతం మొబైల్ ఫోన్ ల తో పాటు గరిష్ఠ సంఖ్య లో మొబైల్ విడి భాగాలు ఉత్తర్ ప్రదేశ్ లో తయారు అవుతున్నాయి అని ఆయన వెల్లడించారు. దేశం లోని రెండు డిఫెన్స్ కారిడార్ లలో ఒక డిఫెన్స్ కారిడార్ ను ఉత్తర్ ప్రదేశ్ లో అభివృద్ధి పరచడం జరుగుతోందని కూడా ఆయన సభికుల దృష్టి కి తీసుకు వచ్చారు. భారతదేశం యొక్క సైన్యాని కి 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ వ్యవస్థలను మరియు ప్లాట్ ఫార్మ్ స్ ను అందజేయాలి అనేది ప్రభుత్వం యొక్క వచనబద్ధత అని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు.

పాడి, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ మరియు ఫూడ్ ప్రోసెసింగ్ లకు సంబంధించినంత వరకు ఉత్తర్ ప్రదేశ్ లో ఉన్న అవకాశాల ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. ప్రైవేటు ప్రాతినిధ్యం ఇంకా పరిమితం గానే ఉన్న రంగాల లో ఒకటి గా ఈ రంగం ఉంది అని ఆయన అన్నారు. ఫూడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ లో పిఎల్ఐ ని గురించి ఇన్ వెస్టర్ లకు ఆయన వివరించారు. రైతుల కు ఇన్ పుట్ దశ మొదలుకొని పంట కోతల అనంతర కాలం లో నిర్వహణ దశ వరకు ఒక నిరంతరాయమైనటువంటి ఆధునిక వ్యవస్థ ను అందుబాటు లోకి తీసుకు రావాలని ప్రభుత్వం కంకణం కట్టుకొందని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. చిన్న ఇన్ వెస్టర్ లు ఎగ్రీ-ఇన్ ఫ్రా ఫండ్స్ ను వినియోగించుకోవచ్చు అని ఆయన అన్నారు.

పంట ల వివిధీకరణ ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, రైతుల కు మరిన్ని వనరుల ను కల్పించడాన్ని గురించి, ఇన్ పుట్ కాస్ట్ ను తగ్గించడాన్ని గురించి ప్రస్తావించారు. ప్రాకృతిక వ్యవసాయం విషయం లో తీసుకొంటున్న శ్రద్ధ ను గురించి ప్రధాన మంత్రి సమగ్రం గా తెలియజేశారు. ఉత్తర్ ప్రదేశ్ లో గంగా నది తీర ప్రాంతాల లో కుడి ఎడమ వైపు లలో 5 కి.మీ. మేర కు ప్రాకృతిక వ్యవసాయం మొదలైపోయింది అని ఆయన వెల్లడించారు. ఈ బడ్జెటు లో 10 వేల బయో-ఇన్ పుట్ రిసోర్స్ సెంటర్ లను ప్రతిపాదించడం జరిగిందని కూడా ఆయన అన్నారు. భారతదేశం లో 'శ్రీ అన్న' గా పిలిచేటటువంటి చిరుధాన్యాల కు ఉన్న పోషక విలువల ను గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ప్రపంచం లో పోషణ భద్రత తాలూకు అవసరాల ను భారతదేశం యొక్క 'శ్రీ అన్న' పరిష్కరించాలి అనే దిశ లో ప్రభుత్వం కృషి చేస్తుంది అని స్పష్టం చేశారు. భుజించడాని కి సిద్ధం గా ఉండేటటువంటి మరియు వండుకోవడాని కి సిద్ధం గా ఉండేటటువంటి 'శ్రీ అన్న' కు సంబంధించిన అవకాశాల ను ఇన్ వెస్టర్ లు గుర్తించవచ్చు అని ఆయన అన్నారు.

రాష్ట్రం లో విద్య పరం గా మరియు నైపుణ్యాభివృద్ధి పరం గా చోటుచేసుకొన్న అభివృద్ధి కార్యాల ను గురించి కూడా ప్రధాన మంత్రి వివరించారు. మహాయోగి గురు గోరఖ్ నాథ్ ఆయుష్ యూనివర్సిటీ, అటల్ బిహారీ వాజ్ పేయీ హెల్థ్ యూనివర్సిటీ, రాజా మహేంద్ర ప్రతాప్ సింహ్ యూనివర్సిటీ మరియు మేజర్ ధ్యాన్ చంద్ స్పోర్ట్స్ యూనివర్సిటీ లు విభిన్నమైన కోవల కు చెందిన నైపుణ్యాల ను నేర్పిస్తాయని ఆయన చెప్పారు. నైపుణ్యాభివృద్ధి ఉద్యమం లో భాగం గా 16 లక్షల మంది కి పైగా యువతీ యువకుల కు శిక్షణ ను ఇవ్వడమైందని ఆయన వెల్లడించారు.

ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం కృత్రిమ మేధస్సు (ఎఐ) కి సంబంధించిన పాఠ్యక్రమాల ను పిజిఐ లఖ్ నవూ లో, ఐఐటి కాన్ పుర్ లో మొదలుపెట్టిన సంగతి ని ప్రధాన మంత్రి ప్రస్తావించారు. దేశం లోని స్టార్ట్-అప్ క్రాంతి లో రాష్ట్రం పాత్ర అంతకంతకూ పెరుగుతూ పోతోందని ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటించారు. రాబోయే కాలాల్లో 100 ఇన్ క్యూబేటర్స్ ను మరియు మూడు అత్యాధునికమైన కేంద్రాల ను ఏర్పాటు చేయాలని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకొందని, అవి ప్రతిభావంతులైనటువంటి మరియు నైపుణ్యం కలిగినటువంటి యువతీ యువకుల తో ఒక పెద్ద సమూహాన్ని సన్నద్ధం చేస్తాయని ప్రధాన మంత్రి చెప్పారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగం ముగింపు లో ఉత్తర్ ప్రదేశ్ లోని డబల్ ఎన్ జిన్ ప్రభుత్వం యొక్క సంకల్పానికి మరియు ఆ రాష్ట్రం లోని అవకాశాల కు మధ్య గల పటిష్ఠమైనటువంటి భాగస్వామ్యాన్ని గురించి ప్రముఖం గా ప్రస్తావించారు. కాలాన్ని ఎంత మాత్రం వృథా పోనివ్వకండి, సమృద్ధి లో వారు పాలుపంచుకోండి అంటూ ఇన్ వెస్టర్ లకు మరియు పరిశ్రమ రంగ ప్రముఖుల కు ఆయన విజ్ఞప్తి చేశారు. "ప్రపంచం యొక్క సమృద్ధి అనేది భారతదేశం యొక్క సమృద్ధి లో ఇమిడి ఉంది. ఈ సమృద్ధి యాత్ర లో మీ యొక్క ప్రాతినిధ్యం చాలా ముఖ్యం" అంటూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమం లో ఉత్తర్ ప్రదేశ్ గవర్నరు శ్రీమతి ఆనందీబెన్ పటేల్, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింహ్, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం లో మంత్రులు, విదేశీ ప్రముఖులు మరియు పరిశ్రమ రంగ ప్రముఖులు పాలుపంచుకొన్నారు.

ఉత్తర్ ప్రదేశ్ గ్లోబల్ ఇన్ వెస్టర్స్ సమిట్ 2023ను ఫిబ్రవరి 10వ తేదీ నాటి నుండి 12వ తేదీ వరకు నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేయడమైంది; ఈ కార్యక్రమం ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం యొక్క ప్రధానమైన పెట్టుబడి శిఖర సమ్మేళనం గా ఉంది. ఇది విధాన రూపకర్తల ను, పరిశ్రమ కు చెందిన నాయకుల ను, విద్యారంగ ప్రముఖుల ను, ఆలోచనపరుల ను, అలాగే ప్రపంచం లో వివిధ ప్రాంతాల కు చెందిన నేతల ను ఒక చోటు కు తీసుకు రావడం తో పాటు సామూహికం గా వ్యాపార అవకాశాల అన్వేషణ కు మరియు భాగస్వామ్యాల ఏర్పాటు కు కూడా దోహద పడనుంది.

ఇన్ వెస్టర్ యుపి 2.0 అనేది ఉత్తర్ ప్రదేశ్ లో ఒక సమగ్రమైనటువంటి, ఇన్ వెస్టర్ ను కేంద్ర స్థానం లో నిలిపేటటువంటి మరియు సేవ ప్రధానం గా పెట్టుబడి సంబంధి ఇకోసిస్టమ్ ను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించినటువంటి కార్యక్రమం. ఇది ఇన్ వెస్టర్ లకు ప్రాసంగికం గా ఉండేందుకు, రాచబాట ను వేసేందుకు మరియు ప్రామాణికమైన సేవల ను అందజేసేందుకు ఉద్దేశించిన కార్యక్రమం.

శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం.. 21 వరకు కొనసాగనున్న ఉత్సవాలు

నంద్యాల,ఫిబ్రవరి 11:: శ్రీశైలం లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం 8.46 గంటలకు యాగశాల ప్రవేశంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ఈనెల 21 వరకు నిర్వహించనున్నట్లు ఈవో లవన్న తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజావరోహణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రేపటి నుంచి స్వామి, అమ్మవార్లకు వివిధ వాహన సేవలు, గ్రామోత్సవం నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

12న భృంగి వాహనసేవ, 13న హంస వాహనసేవ, 14న మయూర వాహనసేవ, 15న రావణ వాహనసేవ, 16న పుష్పపల్లకీ సేవ, 17న గజ వాహనసేవ, 18న మహాశివరాత్రి, ప్రభోత్సవం, నంది వాహనసేవను భక్తుల సమక్షంలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అదేవిధంగా లింగోద్భవకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పాగాలంకరణ, స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తామని వివరించారు.

19న రథోత్సవం, తెప్పోత్సవం, 20న యాగ పూర్ణాహుతి, సదస్యం, నాగవల్లి, ఆస్థాన సేవ, 21న అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఈనెల 13న దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, 14న ఉదయం శ్రీవరసిద్ధివినాయక స్వామి దేవస్థానం, సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం, 15న రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారని వివరించారు.

నిరుద్యోగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, ఫిబ్రవరి 11: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. గురుకుల విద్యాలయాల్లో విద్యానభ్యసించిన వారిలో పలువురికి హైదరాబాద్ బంజారాహిల్స్ లోని మంత్రుల నివాస ప్రాంగణంలో మంత్రి కారుణ్య ఉద్యోగ నియమక పత్రాలను అందచేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు విలువలతో కూడిన విద్యను అందించడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల పాఠశాలల వ్యవస్థను మరింత బలోపేతం చేశారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలను ప్రారంభించిందని పేర్కొన్నారు. గురుకులాల్లో పోషకారం, వసతులను ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. గురుకులాలతో ఆశించిన ఫలితాలు రావడంతో గురుకుల పాఠశాలలో పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు కూడ ఆసక్తి చూపడం అభినందనీయమని అన్నారు.

కారుణ్య నియామక పత్రాలు పొందిన వారంతా తమ తమ విధులు సక్రమంగా నిర్వహించు కోవాలని గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి రోనాల్డ్ రోస్ సూచించారు. ప్రభుత్వ స్ఫూర్తి, లక్ష్యాన్ని ప్రతి ఒక్కరికి తెలియ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యదర్శి హన్మంత్ నాయక్, గురుకుల విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్.టి.పి.సి. సంస్థకు వరుసగా ఆరో సంవత్సరం 'ఏటీడీ ఉత్తమ అవార్డు 2023'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:దేశంలోనే అతిపెద్ద విద్యుత్తు ఉత్పత్తి కార్పొరేషన్ ఎన్.టి.పి.సి లిమిటెడ్ సంస్థను అమెరికాలోని 'అసోసియేషన్ ఫర్ టాలెంట్ డెవలప్‌మెంట్ (ఏటీడీ)'- 'ఏటీడీ బెస్ట్ అవార్డ్స్ 2023'తో సత్కరించింది. టాలెంట్ డెవలప్‌మెంట్ రంగంలో ఎంటర్‌ప్రైజ్ విజయాల్ని ప్రదర్శించినందుకు ఎన్.టి.పి.సి లిమిటెడ్ ఈ అవార్డును గెలుచుకోవడం ఇది ఆరో సారి. సృజనాత్మక పద్ధతుల ద్వారా ఉద్యోగులను నిమగ్నం చేయడమే లక్ష్యంగా ఎన్.టి.పి.సి పని సంస్కృతి పునాది ఎల్లప్పుడూ ముందుకు సాగుతోంది. ఈ అవార్డు ఎన్.టి.పి.సి యొక్క సమకాలీన హెచ్ఆర్ పద్ధతులకు నిదర్శనం. టాలెంట్ డెవలప్‌మెంట్ ద్వారా ఎంటర్‌ప్రైజ్ విధానాన్ని ప్రదర్శించే సంస్థలను ఏటీడీ ఉత్తమ అవార్డులకు గుర్తిస్తారు. ఎన్.టి.పి.సి. సంస్థ ఈ తరహా పర్యావరణ వ్యవస్థను రూపొందించడంలో విజయవంతమైంది, ఇది ఉద్యోగులకు వారి నైపుణ్యాన్ని పెంచుకోవడానికి తగిన వ్యవస్థను అందిస్తుంది.

ఈ అవార్డుల కు ఎంపిక చేసే సంస్థలలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిన్న మరియు పెద్ద ప్రైవేట్, పబ్లిక్ మరియు లాభాపేక్ష లేని సంస్థలూ ఉన్నాయి. అమెరికాకు చెందిన అసోసియేషన్ ఫర్ టాలెంట్ డెవలప్‌మెంట్ అనేది టాలెంట్ డెవలప్‌మెంట్ రంగంలో ప్రపంచం లోనే అతిపెద్ద కూటమి మరియు ఏటీడీ బెస్ట్ అవార్డ్ అనేది లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో అత్యంత గౌరవనీయమైన గుర్తింపుగా భావించబుడుతుంది.

ఐదురోజుల్లో పెరగనున్న చలి.. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 11:రాబోయే ఐదు రోజుల్లో తెలంగాణలో చలి తీవ్రత పెరగనుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దాంతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కొమురంభీం, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, మెదక్, భూపాలపల్లి, నిర్మల్, వరంగల్, మహబూబ్ నగర్, హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో చలి తీవ్రత పెరుగుతుందని చెప్పారు. ఈ నెల 12న (ఆదివారం) ఆదిలాబాద్, కొమురంభీం జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ నెల 13 సోమవారం నాడు హన్మకొండ, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. 14, 15 తేదీలలో ఉమ్మడి ఆదిలాబాద్ లో కనీస ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయే అవకాశం ఉందన్నారు.

రాజధానిపై ప్రజాభిప్రాయం ప్రకారం వెళ్లాలి.. వెంకయ్య నాయుడు

అమరావతి, ఫిబ్రవరి 11:రాజధానిపై ప్రజాభిప్రాయం ప్రకారం వెళ్లాలని మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఆయన ఈరోజు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఎన్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఒక విద్యార్థి రాజధానిపై వెంకయ్య ను ప్రశ్నించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ? తాను వివాదాస్పద అంశాల జోలికి వెళ్లనన్నారు. అమరావతిపై తన అభిప్రాయం ముందే చెప్పానన్నారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ప్రధానితో కలిసి శంకుస్థాపనలో పాల్గొన్నానన్నారు. పట్టణాభివృద్ధి మంత్రిగా నిధులు కూడా మంజూరు చేశానన్నారు. ఇప్పటికే మీకు అర్థమై ఉంటుందంటూ వెంకయ్యానాయుడు క్లారిటీ ఇచ్చారు.

విశాఖ స్టీల్‌లో పేలుడు.. తొమ్మిది మంది కార్మికులకు తీవ్ర గాయాలు

అమరావతి, ఫిబ్రవరి 11: విశాఖ స్టీల్ ఫ్యాక్టరీలో పేలుడు సంబవించి తొమ్మిది మంది కార్మికులు గాయపడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఎంఎస్-2 లిక్విడ్ స్టీల్ విభాగంలో పేలుడు జరగడంతో నలుగురు స్టీల్‌ప్లాంట్, ఐదుగురు కాంట్రాక్ట్ కార్మికులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. గాయపడిన వారిలో ఒక డీజీఎం స్థాయి అధికారి అనిల్ ఉన్నారు. అత్యంత ఉష్ణోగ్రత వద్ద స్టీల్ లిక్విడ్‌ను వేడిచేసి తరలించే లాడెల్ పేలడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనను తెలుసుకున్న ప్లాంట్ ఉన్నతాధికారులు కార్మికులను పరామర్శించారు. వీరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం-ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఫిబ్రవరి 11 : గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల మండలం హజారిగూడెంలో రూ. 10 లక్షల సీడీపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలో వైకుంఠధామం నిర్మించడంతో ఇంటింటికీ తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టి దేశంలో తెలంగాణను అభివృద్ధిలో అగ్రభాగాన ఉంచినట్లు పేర్కొన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో అనుముల, తిరుమలగిరి సాగర్ ఎంపీపీలు సుమతీపురుషోత్తం, భగవాన్‌నాయక్, జడ్పీటీసీ సూర్యభాష్యనాయక్, సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రావుల రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు గుంటుక మధు, భాస్కర్‌రావు, రాంబాబు, బుగ్గయ్య, వెంకన్న, పెద్దిరాజు, వెంకటేశ్వర్లు, కిరణ్‌నాయక్, రాముసాయక్, వివిధ పార్టీల నాయకులు చినభిక్షం పాల్గొన్నారు.

మంత్రి హరీష్ రావుకి ఎమ్మెల్యే జగ్గారెడ్డి వినతి..



హైదరాబాద్, ఫిబ్రవరి 11:అసెంబ్లీలో మంత్రి హరీష్ రావుని తన ఛాంబర్ లో ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఫండ్స్ ఇవ్వాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ స్కీమ్ కింద రూ.5 కోట్ల 50 లక్షల ఫండ్స్ ఇవ్వాలని కోరడం జరిగింది. సంగారెడ్డి పట్టణంలోని ఫాతే ఖాన్ దర్గా అభివృద్ధి కోసం రూ.3 కోట్లు ఇవ్వాలని కోరారు. సంగారెడ్డి పట్టణంలోని ఈద్ గా అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు ఇవ్వాలన్నారు. సంగారెడ్డి పట్టణంలోని దీన్ దార్ ఖాన్ ఫంక్షన్ హాల్ అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించాలని కోరారు. సంగారెడ్డి పట్టణంలోనే ముస్లింల ఖాబారస్థాన్ (స్మశానవటిక) కొరకు 5 ఎకరాల భూమి కావాలని, ప్రభుత్వం చొరవ తీసుకొని త్వరగా భూమి కేటాయించాలన్నారు. సంగారెడ్డి పట్టణంలో హిందువుల స్మశానవటికకు 5 ఎకరాల భూమి కావాలని, ఇది కూడా సర్కార్ వెంటనే పరిశీలించి మంజురు చేయాలన్నారు. ఇక క్రిస్టియన్స్ కోసం కూడా సంగారెడ్డి పట్టణంలో 5 ఎకరాల భూమి క్రిస్టియన్స్ గ్రేవ్ యార్డ్ (స్మశానవటిక)కేటాయించాలని ప్రభుత్వాని కోరుతున్న అన్నారు. సదశివాపేట్ లో మెహబూబ్ పాషా దర్గా అభివృద్ధి కోసం రూ.3 కోట్లు మంజూరు చేయాలన్నారు. అలాగే సదశివాపేట్ లో ముస్లిం ఈద్ గా అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించాలన్నారు. సంగారెడ్డి పట్టణంలో ఉన్న సీఎస్ఐ చర్చి ఉంది ఇది ఎంతో చరిత్ర కలిగిన చర్చి ఈ చర్చ్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించాలని కోరారు. సంగారెడ్డి పట్టణంలో శివాలయం నిర్మించడం జరుగుతుంది, అతి పెద్ద శివలింగం కైలాస ప్రస్తారా శ్రీ చక్రలో శివలింగం ఏర్పాటు చేయబోతున్నారు? దీనికోసం ప్రభుత్వం రూ.18 కోట్లు కేటాయించాలన్నారు. అలాగే సంగారెడ్డి పట్టణంలో వైకుంఠపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.18 కోట్లు కేటాయించాలన్నారు. సంగారెడ్డి జిల్లా హెడ్ క్వాటర్ లో ఆర్యవైశ్య జిల్లా సంఘం భవనం కోసం 2 ఎకరాల భూమి, రూ.3 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరడం జరిగింది. జగ్గారెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యాక్షుడు తోపాజి అనంత కిషన్ గుప్తా, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు తోపాజి హరీష్ గుప్తా కలిసి ఆర్యవైశ్య భవనం కోసం వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

గవర్నర్‌ను కలిసిన టీడీపీ నేతలు

అమరావతి, ఫిబ్రవరి 11:ఏపీ టీడీపీ నేతలు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ ను కలిశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు పోలీసులు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వ భూషణ్ హరి చందన్ ను కలిసి ఫిర్యాదు చేశారు. యాత్రను అడ్డుకోవడమే పోలీసులు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. పాదయాత్రకు పోలీసులు అడ్డంకులు సృష్టిస్తున్నారని టీడీపీ నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రచార రథాలు సీజ్ చేయడమే కాకుండా మైకులు కూడా లాక్కుంటున్నారని గవర్నర్ కి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాదు లోకేష్ కు ప్రాణహాని తలపెట్టే కుట్ర జరుగుతుందని ఫిర్యాదులో తెలిపారు. ఏ పాదయాత్రకు లేని అడ్డంకులు లోకేష్ పాదయాత్రకే వర్తిస్తాయా ? అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఈ ఫిర్యాదు పై తప్పక న్యాయం చేస్తానని గవర్నర్ టీడీపీ నేతలకు హామీ ఇచ్చారు.

ఇక్ఫాయ్ యూనివర్సిటీ దగ్గర గంజాయి కలకలం

హైదరాబాద్, ఫిబ్రవరి 11:నగరంలోని ఇక్ఫాయ్ యూనివర్సిటీ దగ్గర గంజాయి కలకలం చోటుచేసుకుంది. విద్యార్థులకు గంజాయి అమ్ముతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. డెకాయ్ ఆపరేషన్ చేసి స్మగ్లర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. యూనివర్సిటీ విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుపతిలో వైభవంగా శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతి , ఫిబ్రవరి 11:తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుల వేదమంత్రోచ్చారణ, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. పంచమూర్తులైన శ్రీ సోమస్కంధమూర్తి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ వినాయక స్వామి, శ్రీ చండికేశ్వరస్వామి, శ్రీ వల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారి ఉత్సవమూర్తుల సమక్షంలో మీన లగ్నంలో నంది చిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహింపచేశారు.

ఆలయ ప్రధానార్చకులు మణి స్వామి, కంకణభట్టర్ ఉదయస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ, అభిషేకం, బలి, నివేదన, దీపారాధన, ఉపచారాలు నిర్వహించారు. ఏడాదికోసారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం రోజున మాత్రమే ధ్వజస్తంభానికి విశేషంగా అభిషేకం చేస్తారు. పెరుగు, చందనం, విభూది, పన్నీరు, పలురకాల పండ్లరసాలతో వేడుకగా ధ్వజస్తంభానికి అభిషేకం జరిగింది.

దీపారాధనలో భాగంగా రథహారతి, నక్షత్రహారతి, సద్యజాతాది దీపారాధన, కుంభహారతి నిర్వహించారు. ఆ తరువాత ఛత్రం, చామరాలు, అద్దం, సూర్యచంద్రులు, విసనకర్ర, ధ్వజంతో ఉపచారాలు చేశారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాల్లోని మంత్రాలను పఠించారు. అనంతరం శ్రీ పిలేశ్వరస్వామివారికి, శ్రీ కామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. పల్లకీపై స్వామి, అమ్మవారు తిరుపతి పురవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.

రాత్రి 8 నుంచి 10 గంటల వంకు హంస వాహనంపై శ్రీ కపిలేశ్వంస్వామివారు తిరుపతి పురవీధుల్లో విహరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, అధికారు లు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెట్రో ధరలపై నామ మండిపాటు.. మోయలేని భారాలపై తీవ్ర ఆక్షేపణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతూ సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలపై బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు లోక్ సభలో పెద్ద ఎత్తున మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు తగ్గినా ఐదేళ్లలో చారిత్రాత్మకంగా అసాధారణమైన రీతిలో పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం వాస్తవం కాదా ? అని కేంద్రాన్ని లిఖితపూర్వకంగా నిగ్గదీశారు. మధ్య తరగతి ప్రజలపై ఇబ్బడిముబ్బడిగా మోయలేని భారాలను వేస్తుండడాన్ని నామ తీవ్రంగా ఆక్షేపించారు.

పెట్రో ఉ త్పత్తుల ధరలను తగ్గించ డానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో వివరించాలని పేర్కొన్నారు. ధరల ప్రభావం పేద, మధ్య తరగతి ప్రజలపై విపరీతంగా ఉంటుందని, వీటి ప్రభావం మిగతా రంగాలపై కూడా పడడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి రామేశ్వర్ తెలి సమాధానం ఇస్తూ పెట్రో ఉత్పత్తుల ధరలు అంతర్జాతీయ మార్కెట్లో సంబంధిత ఉత్పత్తుల ధరలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. అధిక అస్థిరత, ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా చాలా దేశాలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని చెప్పుకొచ్చారు. ధరలను నియంత్రించేందుకు పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించామన్నారు. ద్రవ్యోల్బణం తగ్గించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పారు.

ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ కృషి అభినందనీయం- సినీ డైరెక్టర్ కాశీ విశ్వనాథ్ అభినందన

హైదరాబాద్ ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ప్రకృతి పట్ల ఉదాసీనత పెరిగి పోయి విపత్తులు కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ తన బాధ్యతగా ప్రకృతి పరిరక్షణ కోసం పరి శ్రమించడం అభినందనీయమని సినీ దర్శకుల సంఘం అధ్యక్షులు, ప్రముఖ నటులు వై. కాశీ విశ్వనాథ్ అన్నారు. శనివారం ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు ఉప్పల వెంకటేష్ గుప్తా, వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య తదితరులు కాశీ విశ్వనాథ్ ను ఫిల్మ్ నగర్లో కలిసి సంస్థ రూపొందించిన 2023 సంవత్సర క్యాలెండర్ అందజేశారు. ఈ సందర్భంగా దర్శకులు కాశీ సంస్థ కృషిని కొనియాడారు. తానూ ప్రకృతి ప్రేమికుడినేనని తన వంతుగా సంస్థ కృషికి సహకరిస్తానన్నారు. ఇంకా సినీ, టీవీ నటులు, యాంకర్ టి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నియోజకవర్గంలో పొంగులేటి పర్యటన

ఖమ్మం, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం నియోజకవర్గంలో శనివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా రఘునాథపాలెం మండలంలోని చెర్వుకొమ్ముతండా, వేపకుంట్ల, చింతగుర్తి గ్రామాలను సందర్శించారు. చెర్వుకొమ్ముతండాలో గుగులోత్ భీముడి కుటుంబాన్ని పరామర్శించారు. వేపకుంట్లలో నేలాల ప్రసాద్ కుమారుని వివాహం ఇటీవల కాగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుక్కల సంగయ్య దంపతులు ఇటీవల వివాహం చేసుకోగా ఆశీర్వదించారు. పట్టువస్త్రాలను కానుకగా సమర్పించారు. కంటిపుడి వరదానం, పగిళ్ళ సుభద్ర కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. చింతగుర్తిలో లుర్థామాతా నూతన దేవాలయ ప్రతిష్ఠమహోత్సంలో పాల్గొన్నారు. అదేవిధంగా పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాలను అందజేశారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం తదితర ప్రాంతాల్లో జరిగిన పలు వివాహాది శుభకార్యక్రమాల్లో పాల్గొని కొత్తజంటలను ఆశీర్వదించారు. పలు ప్రయివేటు కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్ మలీదు జగన్, వడ్డెబోయిన శ్రీనివాసరావు, మైనారిటీ నాయకులు ఇమామ్ భాయ్, బోడా శ్రావణ్ కుమార్, ధరావత్ రామ్మూర్తి నాయక్, గుర్రం సత్యనారాయణ, తాళ్ళూరి రాము, అరివికట్ల సుధీర్, ఎస్.కె. ఆరీఫ్, మూడు చిన్నా నాయక్, తమ్మిన్ని నాగేశ్వరరావు, తోట ప్రసాద్, కొంగర జ్యోతిర్మయి, బాలాజీ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, ధరావత్ సుధాకర్, కొత్త కొమరయ్య, కేలోతు దేవ్సింగ్, జగ్గయ్య, పరికపల్లి శ్రీను, భూక్యా నర్సింహారావు, గుగులోత్ తులిష్యానాయక్, గుగులోత్ లక్ష్మణ్, ఆంబోతు వీరూ తదితరులు ఉన్నారు.

అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దు : టీటీడీ ఈవో

తిరుపతి , ఫిబ్రవరి 11: జీవన విధానంలో ఎదురయ్యే ఆరోగ్య ఇబ్బందులను గుర్తించి వాటిపట్ల అవగాహన కల్పించుకుంటే జబ్బుల నుంచి రక్షణ కల్పించుకోవచ్చని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అన్నారు. టీటీడీ పురుష ఉద్యోగులకు మూడు రోజుల పాటు నిర్వహించే జీవనశైలి రుగ్మతలపై శనివారం మహతి ఆడిటోరియంలో అవగాహన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థూలకాయం వల్ల షుగర్, గుండె సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. రోజుకు 8 గంటల నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, ధ్యానం లాంటి అలవాట్లతో వ్యాధులు రాకుండా నివారించవచ్చునన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థకు కూడా మంచి సేవలు అందించగలుగుతారని ఈవో చెప్పారు. జబ్బుల లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు అనేక వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ప్రముఖ వైద్య నిపుణులతో నిర్వహించే అవగాహన కార్యక్రమం వల్ల ఉద్యోగులకు ఎంతో ఉపయోగం ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి,శ్వేత డైరెక్టర్ ప్రశాంతి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అరవింద్‌కు రైతుల సెగ.. రాజీనామాకు డిమాండ్..

నిజామాబాద్, ఫిబ్రవరి 11:పసుపు పంటను ఏడాది పాటు రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల పసుపు రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారని రాష్ట్ర రైతుల సంఘం అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ పసుపు రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేదంటే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. కోటపాటి ఆధ్వర్యంలో పసుపు రైతు నాయకులు నిజామాబాద్ మార్కెటు యార్డును శనివారం సందర్శించారు. జిల్లాలో40 వేల మంది రైతులు 50 వేలకు పైగా ఎకరాలలో సాగు చేసిన పసుపు పంటకు ధర రాక పోగా రోజురోజుకు ధర పడిపోతున్న నేపథ్యంలో "తెలంగాణ పసుపు రైతుల సంఘం" నాయకులు ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వాలు కల్పించుకొని గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి జిల్లా అధ్యక్షులు పాట్కూరి తిరుపతిరెడ్డి, మంథని నవీన్ రెడ్డి, నక్కల చిన్నారెడ్డి , తదితరులు పాల్గొన్నారు. పసుపుకు మద్దతు ధర, పసుపు బోర్డు తేవడంలో విఫలం అయిన నిజామాబాద్ ఎంపీ వెంటనే స్పందించి, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రెండు సంవత్సరాల క్రితం కొద్దిగా ధర వచ్చినప్పుడు, ఎంపీ తన వలనే ధర వచ్చింది. స్పెషల్ వ్యాగన్ లు పెట్టి పసుపును బంగ్లాదేశ్ కు ఎగుమతి చేయడం వల్లనే ధర వచ్చింది అని ఆరోజు ప్రకటనలు ఇచ్చుకొన్నారు. మరి ఈరోజు 4000 వేలు 5000 కంటే ఎక్కువ ధర రావడం లేదు. 5000 కంటే ఎక్కువ ధర రావడం లేదు ఇప్పుడు ఎగుమతి చేయడానికి వ్యాగన్ దొరకడం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కేంద్ర ప్రభుత్వం మీద ఆధారపడకుండా, ఆంధ్రప్రదేశ్ లో మార్క్ ఫెడ్ ద్వారా 6800/- ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నది . అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా మార్క్ ఫెడ్ కు ఆదేశాలు ఇచ్చి 10.000/- మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది, కేంద్రానికి ఎంఐఎస్ క్రింద కొనుగోలుకు డిమాండ్ చేస్తూ లేఖ పంపాలి. తద్వారా మార్క్ ఫెడ్ కు జరిగె నష్టాన్ని కేంద్రం, రాష్ట్రం చేరి సగం పంచుకొనే వీలు ఉంటుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీ అరవింద్ వెంటనే కేంద్ర బడ్జెట్ లో 100 కోట్లు కేటాయింప చేసి పసుపు బోర్డు తెవాలన్నారు. రైతుల సమస్యలకు ఎంపీ బాధ్యత వహించాలని లేదా భవిష్యత్తులో ఎంపీకి పసుపు రైతుల తగిన గుణపాఠం చెబుతారని కోటపాటి హెచ్చరించారు.

రాజీమార్గం ద్వారానే కేసుల సత్వర పరిష్కారం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి. శ్రీనివాసరావు

ఖమ్మం, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): రాజీమార్గం ద్వారానే కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చొరవతో 2019 మేనెలలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న గంగుల త్రినాథ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు.ఆయన తల్లిదండ్రులు, భార్య ఖమ్మం కోర్టులో భీమా కంపెనీపై కోటి రూపాయలకు కేసు దాఖలు చేశారు. ఇట్టి కేసును జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిపాదించారు. ఇరు పక్షాల వారిని పిలిపించి భీమా కంపెనీ వారితో రాజీకి మార్గం కల్పించి క్షక్షిదారులకు కోటిరూపాయల పరిహారం రాజీ మార్గం ద్వారా అవార్డు జారీ చేశారు. రోడ్డు ప్రమాదం కేసులో ఇంత పెద్ద మొత్తంలో పరిహారం లోక్ అదాలతో లబించడం తెలంగాణాలోనే ఇది ప్రథమం అని భీమా కంపెని న్యాయవాది తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, కక్షిదారుల న్యాయవాదులు రామిశెట్టి హరిప్రసాద్, మద్దిరెడ్డి నిరంజన్ రెడ్డి, భీమా కంపెనీ తరపున బండారుపల్లి గంగాదర్లు, భీమా కంపెనీ ప్రతినిధులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు జాతీయ లోక్ అదాలత్లో పాల్గొన్నారు.

శాసనమండలి చీఫ్ విప్‌గా భాను ప్రసాదరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11:తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ గా కరీంనగర్ ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్ రావు ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భాను ప్రసాదరావు మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలుపొందారు. గతంలో శాసనమండలి విప్ గా పనిచేశారు. భాను ప్రసాద్ రావు నియామకం పట్ల పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తో పాటు టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

పెళ్లి వేడుకలో విషాదం.. ఇద్దరు పిల్లల కోట్లాటంలో ఒకరు మృతి

లక్నో, ఫిబ్రవరి 11: పెళ్లి వేడుకలో విషాదం జరిగింది. ఇద్దరు పిల్లలు కోట్లాడుకోగా ఒక బాలుడు మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవాబ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతంలో గురువారం ఒక జంటకు పెళ్లి జరిగింది. వధూవరులు దండలు మార్చుకుంటుండగా డీజే ఫ్లోర్ వద్ద పిల్లలు డ్యాన్స్ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు పిల్లల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో 12 ఏళ్ల బాలుడు, 11 ఏళ్ల బాలుడ్ని డీజే వేదిక నుంచి తోశాడు. ఆగ్రహించిన 11 ఏళ్ల బాలుడు సాస్ బాటిల్ తీసుకుని 12 ఏళ్ల బాలుడి తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆ బాలుడ్ని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయాడు. కాగా, మరణించిన పిల్లాడిని కమల్ కుమార్‌గా గుర్తించారు. రత్నా నంద్‌పూర్ గ్రామానికి చెందిన ఆ బాలుడు ఐదో తరగతి చదువుతు న్నాడు. చిన్న రైతు అయిన కమల్ తండ్రి హరిశంకర్ దివాకర్, తన కుమారుడి మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో 11 ఏళ్ల బాలుడిపై ఎస్సీ, ఎస్టీ చట్టంతోపాటు, 12 ఏళ్ల కమల్ మరణానికి సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశాడు. నిందిత బాలుడ్ని జువెనైల్ హోమ్‌కు తరలించారు.

డెస్క్ జర్నలిస్టులు..వర్కింగ్ జర్నలిస్టులే

-ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణ

ఖమ్మం, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): డెస్క్ జర్నలిస్టులు...వర్కింగ్ జర్నలిస్టులేనని, జర్నలిస్టులకు కేటాయించే ఇండ్ల స్థలాల ప్రక్రియలో అర్హులైన

డెస్క్ జర్నలిస్టులకు అందుతాయని రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టులకు నిర్వహించే శిక్షణ తరగతులలో పాల్గొనేందుకు వెళ్తున్న నేపథ్యంలో శనివారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హోటల్ లో టీయూడబ్ల్యూజె (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, టెంజూ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో డెస్క్ జర్నలిస్టులు ప్రెస్ అకాడెమీ ఛైర్మెన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజె (టీజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. డెస్క్ జర్నలిస్టుల అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాపురం శ్రీనివాస్, బొమ్మగాని వంశీ(పిచ్చయ్య)ల ఆధ్వర్యంలో డెస్క్ జర్నలిస్టులు ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణను కలిసి మెమోరాండంను అందజేశారు. అనంతరం టీజేఎఫ్ నూతన డెస్క్ జర్నలిస్టుల కమిటీని అల్లం నారాయణ అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ...జనవరి 18న ఖమ్మంలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పక్షం రోజుల్లోనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంను రాష్ట్ర మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, తన్నీరు హరీష్ రావులు వేగవంతం చేసి జర్నలిస్టుల కుటుంబాలలో ఆనందాన్ని నింపారని తెలిపారు. రాష్ట్రంలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికి ఇండ్లస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెస్క్ జర్నలిస్టుల యూనియన్ ఉపాధ్యక్షులు రతన్, అచ్చిరెడ్డి, కోశాధికారి అంజి, టీజేఎఫ్ నాయకులు రాజేంద్రప్రసాద్, యలమందల జగదీష్, ముత్యాల కోటేశ్వరరావు, పి.తిరుపతిరావు బిక్కి గోపి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా వాక్ స్వాతంత్ర్యం లేదు: మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కేంద్రంలోని బీజేపీ సర్కారుపై కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో వాక్ స్వాతంత్ర్యం లేకుండా పోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇవాళ జార్ఖండ్‌లోని సాహెబ్ గంజ్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

పార్లమెంటులో తాను చేసిన ప్రసంగంలోని కొన్ని భాగాలను తొలగించారని ఖర్గే ఆరోపించారు.

దేశంలో పార్లమెంట్‌లోపలగానీ, పార్లమెంట్ బయటగానీ వాక్ స్వాతంత్ర్యం లేదని ఖర్గే మండిపడ్డారు. ఎవరైనా ధైర్యం చేసి మాట్లాడితే వాళ్లను జైలుకు పంపుతున్నారని విమర్శించారు. దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికడతామని చెప్పి 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, కానీ అప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలతోపాటు, పేదరికం పెరుగుతూనే ఉన్నదని దుయ్యబట్టారు.

సాహెబ్‌గంజ్ జిల్లా పాకూర్ పట్టణంలోని గుమానీ గ్రౌండ్‌లో 60 రోజులపాటు కొనసాగే హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ప్రారంభం అనంతరం ఆయన ప్రసంగించారు.

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల గురించి వివరించనున్నారు.

త్వరలోనే లాల్ దర్వాజ అమ్మవారి ఆలయ విస్తరణ పనులు.. మంత్రి తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 11:ఎంతో చరిత్ర కలిగిన ఓల్డ్ సిటీలోని లాల్ దర్వాజ అమ్మవారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం అసెంబ్లీలోని సమావేశ మందిరంలో ఎంఐఎం ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, బలాలతో కలిసి పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అమ్మవారి దర్శనం కోసం ఆలయానికి వచ్చిన సందర్భంలో ఆలయం అభివృద్ధి, విస్తరణ చేపడతామని ప్రకటించారని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు ఆలయ విస్తరణకు అవసరమైన 1100 గజాల స్థలాన్ని గుర్తించడం జరిగిందని, భూ యజమానులు కూడా స్థలం అప్పగించేందుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు.

ఆలయ అభివృద్ధి కోసం భూమి అప్పగిస్తున్న వారికి పరిహారంగా అందించేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ప్రభుత్వం 8.95 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని చెప్పారు. అదేవిధంగా పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పెండ్లిళ్ళు, ఇతర శుభకార్యాలు జరుపుకునేందుకు మూడు నూతన మల్టి ఫర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మాణం కోసం 19 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇందులో కంచన్ బాగ్, ఉప్పుగూడ, జంగంమెట్ లలో మల్టి ఫర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మించడం జరుగుతుందన్నారు. ఉప్పుగూడ హాల్ కు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన రెండు హాల్స్ కు కూడా త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 10 రోజుల్లో భూమిపూజ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, కలెక్టర్ అమయ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ అనీల్ కుమార్, జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ సీఈ జియా ఉద్దీన్, జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీ ముట్టడి..నేతల అరెస్ట్

హైదరాబాద్ ఫిబ్రవరి 11 ();వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని అందుకు అసంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా వడ్డెర సంఘం ఆద్వర్యం లో నేడు అసెంబ్లీ ముట్టడికి వడ్డెర నేతలు యత్నించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వడ్డెరలు అసెంబ్లీ ఆవరణకు చేరుకోవడంతో స్పంది చేరుకోవడంతో అక్కడ వారిని పోలీసులు అడ్డగించారు ఈ సందర్భంగా వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు వేముల రామకృష్ణ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లారు దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే రామకృష్ణను అదుపులోకి తీసుకొని దగ్గర్లోని పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు గతంలో మహబూబ్ నగర్ ఎంపీగా ఉన్నప్పుడు అతి దీనవస్థలో ఉన్న వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భం గా ఆయన గుర్తు చేశారు.కాని ఇప్పట కైనా ముఖ్యమంత్రి ముఖ్య స్పందించి గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ప్రస్తుతం జరుగుతున్న శాసన సభలో వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మర గణేష్ వేముల శ్రీనివాస్ దుండగుల శ్రీనివాస్ వేముల రమేష్ కుమ్మెర శంకర్ మాగని మహేష్ దుండగుల వినోద్ కుమ్మెర నరసింహ దుండగుల బాబు తదితరులు పాల్గొన్నారు

2024 నాటికి 250 ఆఫ్ షోర్ రిసోర్సెస్‌తో టీఎస్క్యుఎస్ విస్తరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (); తమ టాలెంట్ స్ట్రాటజీలో భాగంగా మరియు యుఎస్‌లో వృద్ధి చెందుతున్న వ్యాపారానికి మద్దతు అందిస్తూ , డల్లాస్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ సేవల సంస్థ టీఎస్క్యుఎస్ ఇంక్, తమ హైదరాబాద్ ఆఫ్‌షోర్ కేంద్రంలో 15 మంది ఫ్రెష్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను ఉద్యోగాలలో నియమించుకున్నట్లు వెల్లడించింది.ఔత్సాహిక టెకీలతో కూడిన బృందం ప్రారంభించిన ఈ సంస్థకు అపూర్వమైన ఐటీ అనుభవం ఉంది. పలు ఇంప్లిమెంటేషన్స్‌పై మరియు విభిన్నమైన డొమైన్స్‌లో పనిచేస్తోన్న టీఎస్క్యుఎస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్‌సైకిల్‌లో క్వాలిటీ ఇంజినీరింగ్ ప్రాముఖ్యతను గుర్తించింది మరియు సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ టూల్స్‌ను సైతం గుర్తించింది. ఇవి క్లయింట్స్ అత్యుత్తమ నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అతి తక్కువ ధరలకు అందించేందుకు సహాయపడతాయి అని టీఎస్క్యుఎస్ ఇంక్ వైస్ ప్రెసిడెంట్ (క్వాలిటీ ఇంజినీరింగ్) శ్రీధర్ బొజ్జా అన్నారు.“టీఎస్క్యుఎస్ ఇంక్ పలువురు యువ ఇంజినీర్లను గుర్తించడంతో పాటుగా వారికి అవసరమైన టూల్స్‌పై శిక్షణ అందించి, యుఎస్‌లోని ప్రాజెక్టులలో నియమించింది. ఇప్పటికే చక్కటి ఫలితాలనూ పొందుతుంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం, క్లయింట్స్ బడ్జెట్‌ను పరిగణలోకి తీసుకుని, భారతదేశంలో కూడా అదే తరహా టాలెంట్ వ్యూహం ప్రతిబింబించనున్నాము” అని శ్రీధర్ అన్నారు.సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ బృందాలను నాణ్యమైన ఇంజినీరింగ్ బృందాలుగా మార్చడం ద్వారా సాఫ్ట్‌వేర్ డెలివరీ లైఫ్ సైకిల్ వ్యాప్తంగా తమ నైపుణ్యం మరియు సమస్యా పూరణ అనుభవాన్ని పొందువరచాలనే లక్ష్యంతో , తగ్గించబడిన సమయం, వ్యయాల వద్ద టెస్టింగ్‌ల నకలు తొలగించడం, ఆటోమేషన్ వృద్ధి చేయడం మరియు పునర్వినియోగం చేసేందుకు సంస్థ యొక్క సామర్థ్యం పెంచుకోవాలని టీఎన్‌క్యుఎన్ ఇంక్ లక్ష్యంగా పెట్టుకుంది.“ప్రస్తుత తమ ప్రాజెక్టులతో పాటుగా రాబోతున్న వాటిని పరిగణలోకి తీసుకుంటే మాకు నాణ్యతకు భరోసా అందించే ఇంజినీర్ల అవసరం భారీగా ఉంది. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో పాల్గొనడంతో పాటుగా పక్క రాష్ట్రాల్లో కూడా మా ఆఫ్ షోర్ కార్యకలాపాలను విస్తరించాలనుకుంటున్నాము. 2023లో 100కు పైగాఆఫ్‌షోర్ రిసోర్సెస్‌కు విస్తరించాలన్నది మా ఆలోచన. అలాగే 2024 క్యాలెండర్ సంవత్సరాంతానికి ఈ సంఖ్యను 250కు వృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాము'' అని శ్రీధర్ అన్నారు.మార్కెట్ శోధన మరియు కన్సల్టింగ్ సంస్థ గ్లోబల్ మార్కెట్ ఇన్‌సైట్స్ (జీఎంఐ) ఉటంకించిన శ్రీధర్ మాట్లాడుతూ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ మార్కెట్ ప్రస్తుతం 40 బిలియన్ డాలర్ల మార్కెట్ గా ఉంది. ఇది 2030 నాటికి 70 బిలియన్ డాలర్లు చేరుకోవచ్చని అంచనా. ఇది సీఏజీఆర్ 6%తో వృద్ధి చెందుతుంది. మరీ ముఖ్యంగా ఆటోమేటింగ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రక్రియ కోసం డిమాండ్ పెరుగుతుండటం, నాణ్యత హామీ కోసం చురుగ్గా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం దోహదపడుతున్నాయన్నారు.

హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన ఫార్ములా ఈ కార్ రేసు

హైదరాబాద్, ఫిబ్రవరి 11:వరల్డ్ ఛాంపియన్ షిప్ ఫార్ములా ఈ రేసులో భాగంగా సాగరతీరాన నిర్వహించిన రేసు విజయవంతంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ రేసులో ఎలక్ట్రిక్ కార్లు ఒకదానికి మించి మరొకటి పోటీపడ్డాయి. గంటకు 322 కిలోమీటర్ల వేగంతో రేసుర్లు దూసుకెళ్లాయి. 11 టీమ్‌లు 22 మంది డ్రైవర్లు ఈ రేసులో పాల్గొన్నారు. ఈ రేసులో జీన్ ఎరిక్ విన్నర్‌గా నిలిచారు. రెండో స్థానంలో నిక్ క్యాసిడీ, మూడో స్థానంలో సెబాస్టియన్ బ్యూమీ నిలిచారు. ఈ సందర్భంగా విన్నర్‌కు మంత్రి కేటీఆర్ బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అసౌకర్యానికి మన్నించాలని హైదరాబాద్ నగరవాసులను విజ్ఞప్తి చేశారు.

సాగరతీరాన జరిగిన ఫార్ములా ఈ రేసు చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు సినీ ప్రముఖులు హాజరయ్యారు. మంత్రి కేటీఆర్‌తో పాటు సినీ ప్రముఖులు రామ్ చరణ్, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ హాజరయ్యారు. వీరితో పాటు సచిన్, చాహల్, ధావన్ తదితరులు ఫార్ములా ఈ రేసు వీక్షించారు. కాగా కార్ల వేగం ప్రేక్షకుల కేరింతలతో సాగరతీరం హోరెత్తిపోయింది.

ప్రపంచ నగరాల సరసన హైదరాబాద్..

ఫార్ములా ఈ రేస్ పోటీలకు అనేక దేశాలు శాశ్వత హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాయి. అందులో ప్రధానంగా దిరియా, మెక్సికో సిటీ, బెర్లిన్, మొనాకో, రోమ్, లండన్, జకార్తా, సియోల్ వంటి నగరాల్లో ఈ

పోటీ ఏటా జరుగుతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయి. ఇక మీదట భారతదేశంలో నుంచి హైదరాబాద్ ఈ నగరాల జాబితాలో చేరనుందని నిర్వాహకులు వెల్లడించారు. కాగా ఫార్ములాలో మొత్తం 16 రేసులు నిర్వహిస్తారు. ఒక్కో రేస్‌లో రేసర్ పొందిన పాయింట్ల వారీగా సీజన్ల వారీ పాయింట్లు కలిపి, చివరకు ప్రపంచ చాంపియన్‌ను ప్రకటిస్తారు.

పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాలు కాకుండా కరెంటుతో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలతో రేస్ చేయడమే 'ఫార్ములా ఈ' రేసింగ్ ప్రత్యేకత. ఎలక్ట్రిక్ కార్ల ద్వారా సుస్థిర రవాణాను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశం. భారతదేశంలో ఈ పోటీలు నిర్వహించేందుకు అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీపడినా ఐటీ మంత్రి కేటీఆర్ చొరవతో ఈ ప్రతిష్టాత్మక పోటీలు హైదరాబాద్ వేదికగా జరగడం విశేషం. 2014 బీజింగ్ ఒలింపిక్స్ గ్రౌండ్ దగ్గర మొట్టమొదటి 'ఫార్ములా ఈ' జరిగింది. 2014లో బీజింగ్‌లో ఈ రేస్ ప్రారంభం కాగా చివరిసారి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగింది. ఇవాళ హైదరాబాద్‌లో రేసు జరిగింది. ఆ తర్వాత దక్షిణ ఆఫ్రికాలోని కేప్ టౌన్‌లోజరుగనుంది.

ఎగువ భద్ర ప్రాజెక్ట్‌తో సీమ ఎడారిగా మారక తప్పదు

-కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి

అమరావతి ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఎగువ భద్ర ప్రాజెక్ట్?తో సీమ ఎడారిగా మారక తప్పదని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. సీమలోని తుంగభద్ర హైలెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, కేసీ కెనాల్ ప్రాజెక్టులు నీరు లేక నిరుపయోగం అవుతాయన్నారు. సీమలోని 8 లక్షల ఎకరాల సాగు భూమి బీడవుతుందని మండిపడ్డారు. నికర జలాల కేటాయింపు లేకుండానే కర్ణాటక ప్రభుత్వం ఎగువ భద్ర ప్రాజెక్ట్?ను నిర్మిస్తోందని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్ట్?ను కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి 2023-24 బడ్జెట్?లో రూ.5300 కోట్లు కేటాయించిందన్నారు. ఇంత జరుగుతున్నా ఏపీ ప్రభుత్వం మిన్నకుండిపోతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అప్పర్ భద్ర ప్రాజెక్టు పనులను నిలువరించాలని ఆయన సూచించారు.

విశాఖస్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం.. 11 మంది కార్మికులకు తీవ్రగాయాలు

విశాఖపట్టణం ఫిబ్రబవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: స్టీల్ ప్లాంట్ లో శనివారం ప్రమాదం జరిగింది. ఎస్ఎంఎస్- 2 లిక్విడ్ విభాగంలో పేలుడు జరగడంతో 11 మంది కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిలో నలుగురు రెగ్యులర్ కార్మికులు కాగా, ఐదుగురు ఒప్పంద కార్మికులున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను స్టీల్ ప్లాంట్ ఆసుపత్రి కి తరలించి ప్రాథమిక చికిత్స అందజేశారు. ఫ్లాగ్ యాష్ ను, తొలగించే క్రమంలో, నీళ్లు పడడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడినవారిలో 9 మందికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ సెవెన్ హిల్స్ ఆసుపత్రి కి తరలించారు. స్వల్పంగా గాయపడిన మరో ఇద్దరికి స్టీల్ ప్లాంట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా తీవ్రంగా గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

మమ్మల్ని కట్టేసి వాళ్లకు కొరడా ఇచ్చి కొట్టమన్నట్టుగా ఉంది.: భట్టి విక్రమార్క

హైదరాబాద్ ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అసెంబ్లీలో కాంగ్రెస్ సీనియర్ నేత భట్టి విక్రమార్క మంత్రి హరీష్‌రావు మధ్య సంభాషణ చోటుచేసుకుంది. "కాళేశ్వరానికి పెద్ద ఎత్తు నిధులు ఖర్చు చేశారు. 18 లక్షల ఎకరాల కోసం బ్యారేజీ కట్టారు.. కానీ ఎక్కడా నీళ్లు ఇవ్వలేదు. మునిగిపోయిన పంపుల పరిశీలనకు వెళ్లనివ్వలేదు" అని భట్టి చెప్పుకొచ్చారు. భట్టి వాదనకు హరీశ్ రావు చెప్పిన విషయం ఏమిటంటే.. "వెళ్తామంటే చెప్పండి.. రేపే దగ్గరుండి తీసుకెళ్తాం. కాంగ్రెస్ హయాంలో పాలమూరు బిడ్డలు ఎందుకు వలసపోయారు?. రాష్ట్రంలో 7 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నాం. పాలమూరు ప్రజల గోస తీర్చిన ఘనత ఖీూది. మేము కట్టిన ప్రాజెక్టుల వల్లే నీళ్లు వచ్చాయి. రూ. 3,600 కోట్లతో 5 లక్షల ఎకరాలకు సాగునీరుచ్చాం. ట్రిబ్యునల్‌లో పోరాడి సీమ ఎత్తిపోతల పనులు నిలిపివేసేలా చేశాం. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆగిపోయాయి" అని హరీశ్ రావు సమాధానం చెప్పారు. వెంటనే అందుకున్న భట్టి.... "మాకు మైక్ కట్ చేసి వాళ్లకు ఎలా ఇస్తారు?. మమ్మల్ని కట్టేసి వాళ్లకు కొరడా ఇచ్చి కొట్టమన్నట్టుగా ఉంది." అని అన్నారు. హరీశ్ రావు సమాధానం ఇస్తూ.. "కొరడాతో మేం కొట్టడం లేదు, మీకు మీరే కొట్టుకుంటున్నారు. మీ అధ్యక్షుడు ఒకటి.. మీరు మరొకటి మాట్లాడతారు" అని హరీష్‌రావు పేర్కొన్నారు

ఎన్నికల కమిషనర్‌కు స్వాగతం పలికిన అదనపు కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయం కు విచ్చేసిన సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్. ఎన్నికల కమిషనర్ కు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.

వారి వెంట జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి వి.వి. అప్పారావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఏసిపిలు ప్రసన్న కుమార్, బస్వారెడ్డి, కలెక్టర్ ఆఫీస్ ఏ.ఓ. మదన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయండి

- కొత్తగూడెం ఫోరం కన్వీనర్ గా మసూద్ ఎన్నిక

ఖమ్మం, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో శనివారం అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ కె.వి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథుగా డా. చీమ శ్రీనివాస్ పాల్గొని తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 12వతేది ఆదివారం మధ్యాహం 1:00 నుండి సాయంత్రం 6:00 గంటల వరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు జరుగుతుందని తెలిపారు. కావున తొలిదశ, మలిదశ, ఉద్యమకారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డుని వెంటనే ఏర్పాటు చేసి 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో 20% తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలి. నామినేటేడ్

పదవులలో ఉద్యమకారులకి ప్రాధాన్యత కల్పించాలి. ఉద్యమకారులకి పెన్షన్, ఉచిత బస్సు మరియు ట్రైన్ పాసులను అలాగే ఆరోగ్య కార్డులను 300 గజాల ఇంటి స్థలాన్ని వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించి గౌరవించాలి. అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగాలలో విద్యార్థి ఉద్యమకారులకి కోట కేటాయించాలి. ఇలాంటి పలు అంశాలపై ఈ సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూరపాటి రంగారావు, పాలకుర్తి కృష్ణ, యస్. నరసయ్య, రైస్ అన్వర్, మంచికంటి నరేష్, నెల్లూరి అచ్యుత రావు, కాసాని నాగేశ్వరావు, పగడాల నరేందర్, అబ్బాస్, అమరగాని శ్రీను, భుక్య రాంబాబు, బచ్చల పద్మాచారి, మందడపు శంకర్ రావు, అసిఫ్, బురాన్, రవిచంద్ర చౌహాన్, దాసరి శీను, నాగుల్ మీరా, భుక్య శ్రీనివాస్ నాయక్, బెజ్జంకి ప్రభాకర చారి, పెరుగు వెంకటరమణ యాదవ్, పాల్లెపు సోమరాజు, అబ్దుల్ రెహమాన్, ఉపేంద్ర నాయక్, కొమ్ము ప్రసాద్, సలీం, వీరన్న నాయక్, రవి గౌడ్, దోడ్డ శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల నాగరాజు, చెరుకుపల్లి నాగేశ్వరరావు, అడపా ప్రవీణ్, కాసిం ఖాన్, కొట్టే సుధాకర్, గోపే నాగేశ్వరావు, లాలయ్య, రవీందర్, వీరాస్వామి, పి. శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భాను ప్రసాద్, శంబిపుర్ రాజు, కౌశిక్ రెడ్డిలకు అభినందనలు: మంత్రి పువ్వాడ

ఖమ్మం, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ గా టి. భానుప్రసాద్, విప్ లుగా శంభీపూర్ రాజు(సుంకరి రాజు),పాడి కౌశిక్ రెడ్డిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల వారికి రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఒక ప్రకటన ద్వారా అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అమరావతే ఏపీ రాజధానిగా స్పష్టమైన ప్రకటన చేయండి

-ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ

అమరావతి ఫిబ్రవరి 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ రాశారు. అమరావతే ఏపీ రాజధానిగా కొనసాగుతుందని స్పష్టమైన ప్రకటన చేయండని ఆయన లేఖలో పేర్కొన్నారు.

ఏపీ రాజధాని అమరావతి అని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా పలుమార్లు స్పష్టం చేసిందన్నారు. నాడు జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా అమరావతిని రాజధానిగా అంగీకరించారని గుర్తుచేశారు.

ఏపీ హైకోర్టు కూడా అమరావతినే రాజధానిగా అభివృద్ధి చేయాలని తీర్పునిచ్చిందన్నారు. 3 రాజధానుల బిల్లు రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని లేఖలో పేర్కొన్నారు.

ప్రతి నెల ఒకటో తేదీకి ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం 3 రాజధానులంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. అమరావతి రాజధాని విషయంలో ఇకనైనా వివాదాలకు స్వస్తి పలకండని ఆయన సూచించారు.

గ్లోబల్‌గా మారుతోన్న త్రిపుర.. అంబాస్సా ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:ఈశాన్య రాష్ట్రం దక్షిణాసియా 'గేట్ వే'గా మారబోతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అంబాస్సాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్ని ఆయన ప్రసంగించారు . దేశ నిర్మాణంలో గిరిజన ప్రజల కృషిని గుర్తించడానికి బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. త్రిపురలో హీరా హైవేలు, ఇంటర్నెట్ వేన్, రైల్వేలు-ఎయిర్ వేస్ కు తాను హామీ ఇచ్చానని, ప్రాజెక్టుల డెలివరీని ప్రజలు చూడగలరన్నారు. త్రిపురలో జాతీయ రహదారుల పొడవును రెట్టింపు చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. త్రిపురలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్రిపురలో గ్రామాల్లో ఆప్టికల్ ఫైబర్ వేసే పనులు జరుగుతున్నాయి. గత ఎనిమిదేళ్లలో త్రిపురలో మూడు రెట్లు ఆప్టికల్ ఫైబర్ వేశారు. త్రిపురలోని గ్రామాలను కలుపుతూ 5,000 కిలోమీటర్ల మేర కొత్త రహదారులను నిర్మించారు. అగర్తలాలో కొత్త విమానాశ్రయాన్ని కూడా నిర్మించారు. ఆప్టికల్ ఫైబర్, 4జీ కనెక్టివిటీని గ్రామాలకు తీసుకువస్తున్నారు. ఇప్పుడు త్రిపుర గ్లోబల్ గా మారుతోంది. ఈశాన్య, త్రిపురలను ఓడరేవులతో కలిపేందుకు జలమార్గాలను అభివృద్ధి చేస్తున్నాం. త్రిపుర దక్షిణాసియా ముఖద్వారంగా మారబోతోంది" అని మోడీ పేర్కొన్నారు. 'గృహనిర్మాణం- ఆరోగ్యం- ఆదాయం' అనే మూడు అంశాలు త్రిపురకు సాధికారత కల్పిస్తున్నాయని ప్రధాన మంత్రి మోడీ అన్నారు. పీఎం ఆవాస్ యోజన ఇక్కడి పేద ప్రజల జీవితాలను మార్చిందని ఆయన అన్నారు. గత ఐదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పేదల కోసం 3 లక్షల పక్కా ఇళ్లు నిర్మించిందన్నారు. బీజేపీ మీ సేవకుడిగా, మీ నిజమైన సహచరుడిగా? మీ ప్రతి ఆందోళనను తొలగించడానికి రాత్రింబవళ్లు కష్టపడుతోంది అని ఆయన అన్నారు. త్రిపురలో వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు అభివృద్ధిని అడ్డుకున్నాయని ప్రధాని మోడీ విమర్శించారు. త్రిపురలో ప్రజల ఆదాయాన్ని పెంచడంపై బీజేపీ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పీఎం కిసాన్ కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఈ మొత్తాన్ని పెంచుతామన్నారు.

సింగరేణి ఉద్యోగులు, స్థానిక ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు.. ఖర్చుకు వెనకాడబోమన్న సంస్థ

హైదరాబాద్, ఫిబ్రవరి 11:సింగరేణి సంస్థ తమ ఉద్యోగుల కోసం ఖర్చుకు వెనకాడకుండా నాణ్యమైన మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తోందని, అలాగే సింగరేణి ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల్లో కూడా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని సింగరేణి సంస్థ డైరెక్టర్ ఫైనాన్స్, పర్సనల్ ఎన్. బలరాం అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఉద్యోగులు, అధికారులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది కోసం సింగరేణి వైద్యశాఖ ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎం. నరేష్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ సింగరేణి ప్రాంతానికి దూరంగా ఉండటం వల్ల ఇక్కడి ఉద్యోగుల సౌకర్యం కోసం ఇటువంటి ప్రత్యేక వైద్య శిబిరాలను గతంలో అనేకసార్లు నిర్వహించామని, ఇకపై కూడా అవసరమైన క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని ఎం. సురేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ ఎన్.వి. రాజశేఖర రావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎన్. భాస్కర్ తదితరులు ప్రసంగించారు.

డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. బాలకోటయ్య సారథ్యంలో "డాక్టర్. మోహన్స్ దయాబెటిక్ స్పెషాలిటీస్, మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, క్లోవ్ డెంటల్ హాస్పిటల్స్"కు చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించగా.. సింగరేణి భవన్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సహాయ సిబ్బందికి ఈ క్యాంపులో ఉచితవైద్య పరీక్షలు, స్పెషలిస్టు డాక్టర్లతో కన్సల్టేషన్నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి తదుపరి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల కోసం వైద్య నిపుణులు సిఫార్సు చేశారు. ఈ క్యాంపు నిర్వాహణలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. పూర్ణచందర్రావు, వైద్యశాఖ నుంచి వరాల సత్యనారాయణ, శ్రీధర్ సహకరించారు. తమకోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించడంపై సింగరేణి ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

షూటింగ్‌లో తెలంగాణకు కాంస్య పతకం.. ప్రతిభ చాటిన మేఘన

హైదరాబాద్, ఫిబ్రవరి 11:ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్షిప్ లో తెలంగాణకు కాంస్య పతకం దక్కింది. శనివారం న్యూఢిల్లీలోని కర్ని సింగ్ షూటింగ్ రేంజ్ లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ లో 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ మహిళా విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని మేఘన సాధుల కాంస్య పథకం సాధించింది. అంతర్జాతీయ క్రీడాకారులను వెనక్కి నెట్టి మేఘన సాధుల కాంస్య పథకం సాధించడం విశేషం. ఉస్మానియా యూనివర్సిటీకి కాంస్య పథకం తెచ్చిన మేఘనను వైస్ ఛాన్స్ లర్ తో పాటు ప్రొఫెసర్లు అభినందించారు. ఇటీవల భోపాల్ లో జరిగిన జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో మూడు పథకాలు సాధించింది. మేఘన ఇప్పటికే ఇండియన్ షూటింగ్ టీంకు ఎంపికైన విషయం విధితమే. ఇటీవల ఖేలో ఇండియాకు సైతం మేఘన ఎంపికైంది.

తీర్థాల జాతరకు పోలీసు భద్రత ఏర్పాటు: పోలీస్ కమిషనర్

ఖమ్మం,ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): మహాశివ రాత్రి సందర్భంగా జిల్లాలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన్నట్లు పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు.

శనివారం ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని పోలీస్ కమిషనర్ సందర్శించారు.జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుడా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిర్వహకులు ఆలయ స్వాగత ద్వారం మొదలుకొని గర్భాలయం వరకు క్యూలైన్లు, చలువ పందిళ్లు,పరిసరాలు తిరిగిపరిశీలించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు, పార్కింగ్, ఆర్టీసీ బస్ స్టాప్,తదితర ప్రాంతాల దగ్గర బారికేట్ల ఏర్పాటు పరిశీలించి తగిన సూచనలు చేశారు. వాహన దారులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్నానపు ఘాట్, ఇతర ప్రాంతాలలో నిరంతర విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా అధికారులతో సమన్వయం చేసుకొవాలని సూచించారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకొవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(లాఅండ్ఆర్డర్) సుభాష్ చంద్రబోస్ ,రూరల్ ఏసీపీ భస్కార్రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి రామోజీ రమేష్, ఎస్బి ఎసిపి ప్రసన్నకుమార్, రూరల్ ఎమ్మార్వో సుమ, తీర్థాల సర్పంచ్ బాలు, రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్సై రవి పాల్గొన్నారు.

భోళాశంకర్ సెట్‌లో దర్శకేంద్రుడు..

'వాల్తేరు వీరయ్య' సినిమాతో హిట్ ట్రాక్‌లోకి వచ్చిన చిరు ప్రస్తుతం అదే జోష్‌తో 'భోళా శంకర్' పూర్తి చేస్తున్నాడు. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన 'వేదాలం'కు రీమేక్‌గా తెరకెక్కుతుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ చేశాయి. ఇదిలా ఉంటే తాజాగా భోళా శంకర్ సెట్‌లోకి దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు వెళ్లాడు.

ప్రస్తుతం చిత్రయూనిట్ కోల్‌కత్తా నేపథ్యంలో సాగే ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. కాగా షూటింగ్ జరుగుతున్న సెట్స్‌కు రాఘవేంద్రరావు వెళ్లాడు. అనంతరం మాట్లాడుతూ 'నేను చూడాలని వుంది సెట్స్ కు కూడా వెళ్ళాను. అప్పుడు 'రామ్మా చిలకమ్మా' సాంగ్ తీస్తున్నారు. అది కూడా కోల్‌కతా నేపథ్యంలో సాగింది. ఇప్పుడు ఈ సాంగ్ షూటింగ్ చూస్తుంటే? ఆ పాట జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. ఆ పాటలా ఈ పాట కూడా చార్ట్ బస్టర్ అవుతుంది. అదే విధంగా సినిమా కూడా బ్లాక్‌బస్టర్ సాధిస్తుందని' చెప్పాడు.

ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో చిరంజీవి చెల్లెలిగా కీర్తి సురేష్ నటిస్తుంది. చిరుకు జోడీగా తమన్నా నటిస్తుంది. ఏకే ఎంటర్‌టైనమెంట్స్, క్రియేటివ్ కమర్షియల్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. వీలైనంత త్వరగా సినిమాను పూర్తి చేసి సమ్మర్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. కాగా ముందుగా ఈ సినిమాను ఏప్రిల్ 14న విడుదల చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ షూటింగ్ బ్యాలెన్స్ ఉండటంతో పోస్ట్ పోన్ చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన బండపల్లి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామం శివనామ స్మరణతో మార్మోగింది. గ్రామానికి చెందిన శివ భక్తుడు మ్యాకల రాజమల్లు- లతా దంపతులు గ్రామంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో శివార్చన. ప్రత్యేక పూజ. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున శివ స్వాములు భజన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శివనామ స్మరణతో గ్రామం మార్మోగింది. పూజా కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్పర్సన్ తుల ఉమా. జెడ్పిటిసి నాగం కుమార్.మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య. బిజెపి మండల అధ్యక్షుడు రాకేష్. నాయకులు న్యాత జార్జ్. గడ్డం శ్రీనివాస్ రెడ్డి. గంప పవన్. మ్యాకల మహిపాల్. డాక్టర్ సత్తన్న. అంబాల శ్రీకాంత్. శివ స్వాములు భైరగొని రమేష్. పిట్టల బాబు. హోటల్ రాజు. గోపి తో పాటు పెద్ద ఎత్తున శివ స్వాములు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జడ్పీ చైర్ పర్సన్ పూజలు

బండ పల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి. అరాచక ప్రభుత్వం పోయి నీతివంతమైన పాలన వచ్చేందుకు భగవంతుడు ఆశీస్సులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య. నాయకులు మ్యాకల మహిపాల్. లక్ష్మారెడ్డి. మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో గల్లంతైన హైదరాబాద్ యువకులు.. ఒకరు మృతి ..మరొకరి పరిస్థితి విషమం

నల్లగొండ, ఫిబ్రవరి 11: వివాహ శుభ కార్యక్రమానికి వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు నల్లగొండ జిల్లాలో ఈతకు వెళ్లి కాల్వలో గల్లంతయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్.కె లతీఫ్ అతడి స్నేహితుడు నల్లగొండ జిల్లా నిడమానూర్ మండలం నారమ్మ గూడెంలో శనివారం సాయంత్రం జరిగే వలిమా డిన్నర్‌లో పాల్గొనేందుకు గ్రామానికి చేరుకున్నారు. సమీపంలోని ముదిమణిక్యం మేజర్ కాల్వలో ఈత కోసం స్నేహితులతో కలిసి దిగారు.కాలువ లోతు తెలియక దిగడంతో నీటి ప్రవాహానికి ఇద్దరూ కొట్టుకుపోయారు. కొట్టుకుపోతున్న వీరిని స్థానికులు గమనించి కాల్వలో దూకి వారిని ఒడ్డుకు చేర్చారు. అయితే వీరిలో ఎస్.కె లతీఫ్ అప్పటికే మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు.

వివేకానంద స్కూల్లో ఉచిత కంటి పరీక్ష శిబిరం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ వివేకానందస్కూల్ లో శనివారం శ్రీ రాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ మరియు మన చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ వర్ష కంటి దవాఖాన సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించినానీ ఈ శిబిరం లో 300 స్కూల్ పిల్లలకు కంటి పరీక్ష నిర్వహించగా ఇందులో కంటి చూపు లోపం ఉన్నవారిని గుర్తించి ఉచిత.గా ఉచితంగా కళ్ళ జోడులని పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ వర్ష కంటి దవాఖాన నాగరాజు వారి డాక్టర్ ల బృందం శ్రీ రాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ నుండి మామిడిపెల్లి రాజన్న, రాగంపేట హరి మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మోటూరి మధు, చెపూరి రమేష్, కట్ట శ్రీనివాస్, కొమురవెల్లి శివుడు, లాల దేవయ్య, అలీం వివేకానంద స్కూల్ హెడ్ మాస్టర్ మరియు టీచర్స్ తదితరులు పాల్గొన్నారు..

శివ దీక్ష సేవ ట్రస్టుకు ఒక లక్ష 16 రూపాయలు

విరాళం సమర్పించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని "శ్రీ పార్వతీ రాజ రాజేశ్వర శివ దీక్షా సేవా ట్రస్టు"వారికి ఒక లక్షా పదహారు(1,00016/- రూపాయల"విరాళాన్ని బుధవారం మార్కెట్ కమిటీ మాజీ మార్కెట్ కమిటీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి అందజేశారు . మనోహర్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ధార్మిక కార్యక్రమాలకు సైతం తనవంతుగా విరాళం అందజేసిన ఏనుగు మనోహర్ రెడ్డి తన భక్తిని చాటుకున్నాడని ఈ సందర్భంగా శివ దీక్ష సేవా ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూడపెల్లి సర్పంచ్ చిలుక అంజి బాబు, ట్రస్టు నిర్వాహకులు మచ్చ కిషన్, రాపెల్లి శ్రీధర్, గుంటి కనకయ్య, రమణ, చేపూరి గణేష్, బండ చందు తదితరులు పాల్గొన్నారు..

పాక్‌తో మ్యాచ్‌కు ముందు భారత్‌కు షాక్.. గాయంతో స్టార్ ఓపెనర్ దూరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11:పొట్టి వరల్డ్ కప్‌లో తొలి మ్యాచ్‌కు ముందు భారత మహిళల క్రికెట్ జట్టుకు షాక్. ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానా పాకిస్థాన్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు దూరం కానుంది. వేలికి గాయం కారణంగా మంధాన ఆడటం లేదని సమాచారం. 'ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా మంధాన గాయపడింది. అయితే.. ఆమె మొత్తానికే వరల్డ్ కప్ టోర్నీకి దూరం కానుందా? అనేది ఇప్పుడే చెప్పలేం. అయితే.. పాకిస్థాన్ మ్యాచ్‌కు మాత్రం తాను అందుబాటులో ఉండదు' అని ఐసీసీ తెలిపింది.

గ్రూప్ ? బిలో ఉన్న పాకిస్థాన్, భారత్ ఆదివారం (ఫిబ్రవరి 12న) వరల్డ్ కప్ తొలి పోరులో తలపడనున్నాయి. ఓపెనర్‌గా శుభారంభం అందించే మంధాన తొలి మ్యాచ్ ఆడకపోవడం భారత్‌ను కలవర పెడుతోంది. అయితే. వెస్టిండీస్‌తో ఫిబ్రవరి 15న జరిగే మ్యాచ్‌కు మంధాన అందుబాటులో ఉండనుందని తెలుస్తోంది.

హర్మన్ భుజానికి గాయం

ఆస్ట్రేలియాతో సోమవారం జరిగిన వామప్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా మంధాన గాయపడింది. ఆమె ఎడమచేతి మధ్య వేలికి గాయం అయింది.

దాంతో, బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన రెండో వామప్ మ్యాచ్‌కు మంధాన దూరమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా ఫిట్‌నెస్ సమస్య ఎదుర్కొంటోంది. ఈమధ్యే దక్షిణాఫ్రికాలో జరిగిన ట్రై సిరీస్ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ భుజానికి గాయం అయింది.

అయితే.. 'నా శరీరం ఇప్పుడు బాగానే ఉంది.

విశ్రాంతి తీసుకోవడం వల్ల ఇబ్బందిగా అనిపించడం' లేదు అని హర్మన్ తెలిపింది

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURTS AT SECUNDERABAD
O.P. NO.446 OF 2022
Haisi Devi Bai & Others V/S Mohammed Kaleem & Others
NOTICE
To
R1. Mohammed Kaleem S/o Jaffer, Occ: Driver, R/o. H.No. 14-20-258, P N Nagar, Near Borabanda Railway Station, Motinagar, Hyderabad.
WHEREAS the Petitioners have filed the above case for compensation under M.V Act and Rules and the same is posted for your appearance and counter on **20.02.2023.**
Hence, you are requested to appear before the said Hon'ble court, at 10.30 AM either in your person or through your Advocate on the said date, otherwise, the matter will be decided in your absence.
//BY ORDER //
COUNCEL FOR THE PETITIONERS
M/S. P. SRINIVAS
M. DHANALAKSHMI
N. RAJU NAIK
K. SNEHA
Advocates.
H.No.6-18/1, "SHREE" NIVAS Sreeram Nagar Colony Anupuram, Kapra, ECIL, Hyderabad-500 062
Cell: 9246365011

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.